RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

సంచిక: 07 | సంపుటి:3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 5-7-2026 | పేజీలు: 8 | వెల: రూ.5.00


**నీలగిరి నిత్యపద్యం**

**ఆటవెలది**

పుస్తకములు చదువు పుష్కలముగ నీవు
మరచిపోదుననుచు మదిన వలదు
పుస్తకమ్ము నీదు మస్తకమ్మునెపుడు
శుద్ధిచేసి మంచి బుద్ధి పెంచు

మీ విజయప్రసాద్
నలుమాసు తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్)
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్‌లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
మండల రిపోర్టర్‌లు
- క్రైమ్ రిపోర్టర్‌లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్‌లు కావలెను.
వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909.




2లో

## మాజీ అధ్యక్షులందరితో రీయూనియన్

డొనాల్డ్ ట్రంప్ ఆలోచన ఉషా వాన్స్ పాడ్‌కాస్ట్‌లో వెల్లడి



## లక్ష మంది అనర్హులకు పింఛన్!

- ఆచూకీ తెలియని 30 వేల మంది లబ్ధిదారులు
- రాష్ట్రం వెలుపల 5వేల మంది నివాసం
- లైవ్ అథెంటికేషన్ ప్రక్రియలో విస్తుపోయే నిజాలు
- బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న వాటిల్లో అక్రమాలు
- 17 లక్షల మంది వివరాల పరిశీలన

హైదరాబాద్: లోతైన పరిశీలన జరిపే కొద్దీ అనర్హులకు చేయూత పింఛన్లు అందుతున్న వైనం విస్మయం కలిగిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వపరంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్న లైవ్ అథెంటికేషన్ ప్రక్రియలో పెద్దసంఖ్యలో అనర్హుల జాబితా బయటకు వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 42 లక్షల మంది చేయూత పెన్షన్ దారులుండగా (దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి

## కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు

- కుప్పాన్ని 'స్వర్ణ కుప్పం'గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- రూ.118 కోట్లతో ఆధునిక బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శంకుస్థాపన
- కర్నూలు జిల్లా జొన్నగిరి తరహాలోనే కుప్పంలోనూ బంగారు గనులు ఉన్నాయని వెల్లడి
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు, సీమలో ఫ్యాక్షన్ యుగం ముగిసిందని స్పష్టీకరణ
- అమరావతి రాజధానిగా ఉండాలని ప్రజలు కోరుకుంటే, గొడ్డలి పార్టీ 'మావిగన్' అంటోందని ఎద్దేవా



తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా... రూ.118 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన చంద్రబాబు, అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూనే గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

**కుప్పంలోనూ బంగారు గనులు**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు కుప్పం ప్రాంతంలోనూ బంగారు గనులు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని చంద్రబాబు సంచలన విషయం వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ బంగారు

- మిగతా 2వ పేజీలో





## వీళ్లెందుకు మళ్లీ రావాలి?..

### ఏం అన్యాయం చేసిందని ప్రజా ప్రభుత్వం పోవాలి?

- పాపాల భైరవుడు రావాలి.. రావాలి అని కొడుకు, అల్లుడు తిరుగుతున్నారు
- 2034 వరకు కాంగ్రెస్‌దే అధికారమన్న ముఖ్యమంత్రి
- రాహుల్‌ను ప్రధానిని చేసేందుకు రాష్ట్ర ప్రజలు తనతో కలిసి నడవాలని పిలుపు
- మిడ్జిల్ మండలానికి ఏమిచ్చినా, చివరికి తన ప్రాణమిచ్చినా తక్కువేనని వ్యాఖ్య
- మిడ్జిల్‌లో పర్యటన.. అంబేడ్కర్, ధ్యాప గోపాల్‌రెడ్డి విగ్రహాల ఆవిష్కరణ
- రూ.17 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మహబూబ్‌నగర్: పాపాల భైరవుడు రావాలి.. రావాలి అని కొడుకు, అల్లుడు తిరుగుతున్నారని, పదేళ్లలో రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసిన కేసీఆర్ ప్రజలకు ఏం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి నిలదీశారు. 'మీ ఊళ్లలో ఎవరికైనా డబుల్

- మిగతా 2వ పేజీలో



## రంకెలు వేస్తే అంకెలు మారవు

- బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లే
- దీనిపై అసెంబ్లీలోనైనా, బహిరంగ వేదికపైనైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సవాల్
- కాంగ్రెస్ ఇప్పటివరకు రూ.4.50 లక్షల కోట్ల అప్పు చేసిందని వ్యాఖ్య

హైదరాబాద్: అప్పుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు.

- మిగతా 2వ పేజీలో

## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?




- రావణ్ కు మద్దతుగా నిలిచిన ప్రకాశ్ రాజ్
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ వరుస ట్వీట్లు
- రావణ్ తో ఉన్న చీకటి సంబంధాలు ఏమిటో చెప్పాలని డిమాండ్

2లో

## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం..

- 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన
- కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక
- కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదన్న కవిత





2లో

## ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- పౌరులపై ఆర్థిక భారాన్ని చాలావరకు తగ్గించాం
- ప్రజలను భయపెట్టాలని చూసిన శక్తులకు నిరాశే మిగిలింది
- ఏప్రిల్--జూన్‌లో చమురు కంపెనీలు రూ.75,000 కోట్లు నష్టపోయాయి
- ఆ నష్టభారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించింది
- స్వయం సమృద్ధిని సాధించినప్పుడే ఆత్మగౌరవం పెరుగుతుంది
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం..

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన (౧=ా)' పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నమోదు ప్రక్రియ ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మరో మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని స్పష్టం చేస్తూ కవితకు అధికారికంగా లేఖ రాసింది. నిర్ణీత గడువులోగా కొత్త పేర్లు పంపకపోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును క్లోజ్ చేస్తామని సీఈసీ ఆ లేఖలో కఠినంగా హెచ్చరించింది. ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. ఎన్నికల సంఘం లేఖలో పేర్కొన్న అభ్యంతరాలకు తాము ఇప్పటికే రాతపూర్వక సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఈసీ కోరినట్లుగా ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లను పంపే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. 'తెలంగాణ రక్షణ సేన' పేరుపైనే తాము ముందుకు వెళ్తామని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని కవిత స్పష్టం చేశారు.

## కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు

నిక్షేపాలను వెలికితీసి, 'స్వర్ణ కుప్పం' ఆవిష్కరణకు నిజమైన అర్థం కల్పిస్తామని ప్రకటించారు. మైక్రో ఇరిగేషన్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుప్పం మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. హంద్రీ-నీవా జలాలతో 110 చెరువులు నింపామని గుర్తుచేశారు. రాయలసీమను ఉద్యాన హబ్?గా మార్చే 'పూర్వోదయ' ప్రాజెక్టుకు వచ్చే నెల మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అదే స్థానంలో సౌర విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా మార్చే క్రమంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. "ఉద్యోగాల కోసం కుప్పం యువత బయటకు వెళ్లడం కాదు, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 80 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థతో పాటు టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కుప్పానికి వస్తున్నాయని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్, బీసీ, ఓసీలకు రూ.552 కోట్లతో సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. 'నెట్ జీరో' విధానంలో భాగంగా ఇళ్లపైనే కూరగాయలు పండించుకోవడం, ఈ-సైకిళ్ల వాడకం పెంచి కుప్పాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 'హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.


## రంకెలు వేస్తే అంకెలు మారవు

బీఆర్ఎస్ పాలనలో రూ.8.21 లక్షల కోట్ల అప్పు అంటూ గోబెల్స్ ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయలేక, రోజూ బయటపడుతున్న అవినీతి ఆరోపణలు, స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రోజుకో కొత్త అప్పుల లెక్క చెబుతున్నారని ధ్వజమెత్తారు. 'రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు. మా మాట అసెంబ్లీలో ఒకటే.. బయట ఒకటే. మీరు మాత్రం శ్వేతపత్రంలో ఒకలా, అసెంబ్లీలో మరోలా, ప్రెస్‌మీట్లలో ఇంకోలా చెబుతున్నారు. బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడిగా, ఎమ్మెల్యేగా, తెలంగాణ ఉద్యమకారుడిగా, కేసీఆర్ శిష్యుడిగా చెప్తున్నా. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లే. దీనిపై అసెంబ్లీలోనైనా, బహిరంగ వేదికపైనైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం..'అని మరోసారి సవాల్ విసిరారు. రాష్ట్రానికి అప్పులు ఇప్పించేందుకు సచివాలయం చుట్టూ బాంబే, గుజరాత్ బ్రోకర్లు తిరుగుతున్నారని లంచాలు ఇచ్చి అప్పులు తెచ్చే దుస్థితి దేశంలో ఎక్కడా లేదని ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కేపీ వివేక్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి చెప్పిన అప్పుల లెక్కలకు కౌంటర్ ఇచ్చారు. 'భట్టి విక్రమార్క వెల్లడించిన పత్రాల్లో.. తెలంగాణ ఏర్పాటుకు ముందున్న రూ.84,268 కోట్ల రుణాలను, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు తీసుకున్న రూ.15,118 కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలో కలిపేశారు. ఈ రెండూ కలిపి రూ.99,386 కోట్లను 2023 డిసెంబర్ నాటికి ఉన్న మొత్తం బకాయి రూ.5,16,881 కోట్ల నుంచి తీసేస్తే అసలు అప్పు రూ.4,17,495 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రం, కాగ్ నివేదిక, ఆర్బీఐ గణాంకాలు, ఎకనామిక్ సర్వే అన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లేనని చెబుతున్నాయి. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3.47 లక్షల కోట్లు అప్పు చేసినట్లు మార్చి 18న అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. కానీ ఇప్పుడు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మాత్రం రూ.1.77 లక్షల కోట్లే అని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చెప్పింది నిజమా? లేక ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పింది నిజమా? నాలుగు నెలల్లో అప్పు ఎలా తగ్గింది?..'అని హరీశ్‌రావు నిలదీశారు. ఈ ఏడాది జూన్ 30 నాటికి అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పు చేసిందని చెప్పారు. 'ప్రస్తుత ప్రభుత్వం అప్పులు కూడా పారదర్శకంగా తీసుకురాలేక బ్రోకర్లకు వందల కోట్ల రూపాయల కమీషన్లు చెల్లిస్తోంది. టీజీఐఐసీ భూముల తాకట్టు ద్వారా రూ.10 వేల కోట్ల అప్పు కోసం రూ.170 కోట్ల బ్రోకరేజ్ చెల్లించారు. హెచ్ఎండీఏ భూములపై మరో రూ.20 వేల కోట్ల అప్పు తెస్తే మొత్తం రూ.510 కోట్ల వరకు బ్రోకర్లకు చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు. డిస్కంలు, హైదరాబాద్ కార్పొరేషన్లు, వాటర్ బోర్డు ద్వారా మరో రూ.70 వేల కోట్ల అప్పు సమీకరించే లక్ష్యంతో మొత్తం లక్ష కోట్ల అప్పులకు రూ.1,710 కోట్ల వరకు కమీషన్లు వెళ్తున్నాయి..'అని హరీశ్‌రావు ఆరోపించారు.

# ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

పాచ్‌పద్రా/జోధ్‌పూర్: ఈ శతాబ్దంలో అతిపెద్ద ప్రపంచ ఇంధన సంక్షోభాల్లో ఒకదానిని మనం విజయవంతంగా అధిగమించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. చురుకైన ప్రభుత్వ విధానాలు, వైవిధ్యమైన ఇంధన వనరులు, బలమైన దౌత్య సంబంధాల ద్వారా పౌరులపై ఆర్థిక భారాన్ని చాలావరకు తగ్గించామని తెలిపారు. ఇంధన సంక్షోభం కారణంగా ప్రధాన దేశాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని వెల్లడించారు. ఇంధనం విషయంలో కొన్ని శక్తులు ప్రజల్లో భయాన్ని వ్యాప్తి చేయడంలో నిమగ్నమయ్యాయని విమర్శించారు. రాజకీయ క్రీడలు సాగాయని అన్నారు. కానీ, ప్రజలకు ఉపశమనం కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఆ శక్తుల పథకం పారలేదని, తీవ్ర నిరాశలో కూరుకుపోయాయని ఎద్దేవా చేశారు. సంక్షోభాన్ని మనం అధిగమించిన తీరు చరిత్రలో ఒక అపూర్వమైన అధ్యాయంగా గుర్తుండిపోతుందని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ శనివారం రాజస్తాన్‌లో పర్యటించారు. బలోత్రాలో దేశంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ--పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. పశ్చిమాసియాలో జరిగిన యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని సృష్టించిందని గుర్తుచేశారు. అనేక శక్తివంతమైన దేశాలు ఇంధన కొరతతో సతమతమయ్యాయని అన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, పరిస్థితిని సరిగ్గా అంచనా వేయడం, మన వనరులను సమతుల్యంగా ఉపయోగించడం, దౌత్య బలాన్ని సానుకూలంగా వినియోగించుకోవడం ద్వారా ఈ సవాలును సమర్థంగా ఎదుర్కొన్నామని స్పష్టంచేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీని ఏప్రిల్ 21న మోదీ చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉండగా, 20న జరిగిన అగ్?నప్రమాదం వల్ల వాయిదా పడిన సంగతి తెలిసిందే. రెండు నెలల్లోనే మరమ్మతులు పూర్తి చేసినందుకు అధికారులను మోదీ అభినందించారు. అనేక అభివృద్ధి చెందిన దేశాలు చమురు శుద్ధి సామర్థ్యాన్ని పెంచుకోవడంలో విఫలమైనప్పటికీ.. భారతదేశం మాత్రం ఆ సామర్థ్యాన్ని గణనీయంగా విస్తరింపజేసుకుంది. గత 50 ఏళ్లలో అమెరికా కొత్తగా చమురు శుద్ధి కర్మాగారాన్ని నిర్మించలేదు. ఐరోపా శుద్ధి సామర్థ్యం నానాటికీ తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం అయిల్ రిఫైనరీ సామర్థ్యం పరంగా భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద దేశంగా అవతరించింది. ఈ సామర్థ్యం ఇంకా పెరుగుతూనే ఉంటుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం వల్ల ఏప్రిల్ నుంచి జూన్ మధ్య మన దేశ చమురు కంపెనీలు రూ.75,000 కోట్లకు పైగా నష్టాలను చవిచూశాయి. అయితే, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించింది. ప్రపంచవ్యాప్తంగా చాలాదేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40 నుంచి 50 శాతం వరకు పెరిగాయి. ఇంధనాన్ని కోటా పద్ధతిలో పంపిణీ చేశారు. మన దేశంలో ఒక్కరోజు కూడా అలాంటి పరిస్థితి తలెత్తలేదు. కొందరు మాత్రం చమురు విషయంలో వదంతులు వ్యాప్తి చేశారు. ప్రజలను భయపెట్టారు, రాజకీయ క్రీడలు ఆడారు. కానీ, వారు సఫలం కాలేకపోయారు. సంక్షోభ సమయంలో మనం తీసుకున్న ప్రతి కీలక నిర్ణయం చరిత్రలో భాగం అవుతుంది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాంతీయ అనుసంధాన పథకం 'ఉడాన్'తదుపరి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. అలాగే జోధ్‌పూర్ విమానాశ్రయంలో రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త టెరి?మనల్ భవనాన్ని ప్రారంభించారు. సవరించిన ఉడాన్ పథకాన్ని ఈ ఏడాది ప్రారంభంలో కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ పథకం అమలుకు రాబోయే పదేళ్లలో దాదాపు రూ.29,000 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. మన ఎల్పీజీ అవసరాల్లో దాదాపు 70 శాతం దిగుమతుల ద్వారానే తీరుతోంది. ఆ సరఫరాలలో సుమారు 90 శాతం ఎల్పీజీ హార్మూజ్ జలసంధి గుండా గల్ఫ్ దేశాల నుంచి వస్తోంది.

## లక్ష మంది అనర్హులకు పింఛన్!



మహిళలు ఇలా వివిధ కేటగిరీల వారు), వారిలో దాదాపు 19 లక్షల మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెలా కోర్ బ్యాంకింగ్ విధానంలో (సీబీఎస్) పెన్షన్ జమ అవుతోంది. అయితే దీనికి సంబంధించి గతంలో దారిద్ర్య నిర్మూలనాసంస్థ (సెర్ప్) నిర్వహించిన పైలట్ పరిశీలనలో పెద్దఎత్తున అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా లైవ్ అథెంటిఫికేషన్ ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం వరకు సుమారు 17 లక్షల మంది లబ్దిదారుల ధ్రువీకరణ పూర్తికాగా, మరో 2 లక్షల మంది ధ్రువీకరణ మిగిలి ఉంది. ఈ లబ్దిదారుల లైవ్ అథెంటిఫికేషన్‌ను కూడా ప్రభుత్వం వేగంగా పూర్తి చేసే దిశలో చర్యలు చేపడుతోంది. ఇప్పటికే గుర్తించిన అనర్హుల స్థానంలో అర్హులైన పేదలకు పెన్షన్లు మంజూరు చేయడం ద్వారా కొత్తగా 2 లక్షల మందికి నూతనంగా అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు పూర్తయిన ధ్రువీకరణలో దాదాపు లక్ష మంది దాకా అనర్హులకు పింఛన్లు అందుతున్నట్లుగా గుర్తించారు. దీంతో ప్రభుత్వం నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతను మరింతగా అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటివరకు నిర్వహించిన ధ్రువీకరణలో ఆందోళనకర విషయాలు వెలుగుచూశాయి. దాదాపు లక్ష మంది దాకా అనర్హులుగా గుర్తించారు. వారిలో దాదాపు 65 వేల మంది మరణించినప్పటికీ వారి పేర్లపై పింఛన్లు కొనసాగుతున్నట్లు తేలింది. అదేవిధంగా 30 వేల మంది లబ్దిదారుల ఆచూకీ లభించలేదు. నమోదైన మొబైల్ నంబర్లకు పలుమార్లు సంప్రదించినప్పటికీ స్పందన రాకపోవడంతో వారు వాస్తవంగా ఉన్నారా? లేక వారి పేర్లపై ఎవరైనా అక్రమంగా పెన్షన్లు పొందుతున్నారా? అనే అంశంపై మరింత విచారణ కొనసాగుతోంది. దీంతో పాటు సుమారు 5 వేల మంది రాష్ట్రం వెలుపల నివసిస్తున్నట్లు గుర్తించారు. వీరిలో పలువురు ఇతర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా పొందుతున్నట్లు ప్రాథమికంగా తేలింది. మరోవైపు సుమారు 700 మంది లైవ్ అథెంటిఫికేషన్‌కు సహకరించకుండా, పెన్షన్ కొనసాగింపుపై ఆసక్తి చూపడం లేదు. ఇక సాంకేతిక కారణాలతో కొందరి ధ్రువీకరణ ప్రక్రియ నిలిచిపోయింది. దాదాపు 12 వేల మంది లబ్దిదారుల ఆధార్ వివరాల్లో సమస్యలు ఉండగా, మరో 33 వేల మందికి బయోమెట్రిక్ ధ్రువీకరణలో ఇబ్బందులు ఎదురయ్యాయి. వేలిముద్రలు సరిపోలకపోవడం, ఐరిస్ స్కాన్ నమోదు కాకపోవడం వంటి కారణాలతో వీరి ధ్రువీకరణ పూర్తికాలేదు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. తాజాగా మొత్తం సీబీఎస్ పింఛన్‌దారులు 19 లక్షలు కాగా వారిలో 15,50,000 అథెంటికేషన్ పూర్తి అయ్యింది. రిమార్క్స్ కాప్చర్ అయినవారు 1.40 లక్షల మంది ఉన్నారు. కాగా, మరో రెండు లక్షల దాకా అథెంటికేషన్లు పూర్తి చేయాల్సి ఉంది.

## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?

యూట్యూబర్ ప్రశ్న రావణ్ (జోసెఫ్) అరెస్టుల పర్వంపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన విమర్శలకు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఘాటుగా బదులిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కావాలనే అశాంతిని, ఘర్షణ వాతావరణాన్ని రగిల్చేందుకు ఒక ముఠా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. మీడియా ముఖంగా ప్రకాశ్ రాజ్, రావణ్‌లపై విరుచుకుపడిన మంత్రి... వారిద్దరినీ సమాజ విద్రోహ శక్తులుగా అభివర్ణించారు. అసలు ఈ వివాదాస్పద యూట్యూబర్‌తో ప్రకాశ్ రాజ్‌కు ఉన్న చీకటి సంబంధాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎన్నో అకృత్యాలు సాగాయని, హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని.. అప్పుడు లేవని ప్రకాశ్ రాజ్ గొంతు ఇప్పుడు ఎందుకు లేస్తోందని మంత్రి కందుల దుర్గేశ్ నిలదీశారు. "నాడు మూగనోము నోమిన మీరు.. నేడు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడానికి తాడేపల్లి ప్యాలెస్ నుంచి ప్రతి నెలా ఎంత డబ్బు అందుకుంటున్నారు?" అంటూ నేరుగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించి శాంతిభద్రతలను దెబ్బతీయడానికే ఇలాంటి శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వీటిని ప్రభుత్వం కఠినంగా అణచివేస్తుందని మంత్రి హెచ్చరించారు.

## మాజీ అధ్యక్షులందరితో రీయూనియన్

అమెరికా 250వ స్వాతంత్ర్య ఉత్సవ వేడుకల్లో భాగంగా "స్టోరీ టైమ్ విత్ సెకెండ్ లేడీ' పేరుతో ఈ పాడ్‌కాస్ట్‌ను నిర్వహించారు. ఇందులోనే డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే' పుస్తకంలో కొంత భాగాన్ని చదివి వినిపించారు. బహిరంగ సభలు, విలేకరుల సమావేశాల్లో ఒబామా, బైడెన్‌లను విమర్శించే అవకాశాన్ని ఏనాడూ వదులుకోని ట్రంప్ వారితో కలిసి సూపర్ బౌల్ మ్యాచ్ చూసేందుకు వైట్‌హౌస్‌లో ఆతిథ్యం ఇవ్వాలన్న ఆలోచన ఉషా వాన్స్‌దేనని వెల్లడించారు. "బరాక్ ఒబామా, జో బైడెన్‌లతోపాటు బుష్‌లను ఆహ్వానించాలనుకుంటా. బహుశా వీరిలో కొందరినైనా ఆహ్వానించి వారితో కలిసి ఫుట్‌బాల్ మ్యాచ్ చూడాలి. ఇదే మంచి స్టోరీ అవుతుంది కదా?. మీడియాకు పిచ్చెక్కుతుంది. అధ్యక్షుల రీ యూనియన్ అంటే సరదాగానూ ఉంటుంది" అని అన్నారు.

# వీళ్లెందుకు మళ్లీ రావాలి?..

బెడ్రూమ్‌లు, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాలు ఇచ్చారా? కోటి ఎకరాలకు నీళ్లు అందించారా? ఎందుకు వీళ్లు మళ్లీ రావాలి?..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనను రావణుడితో, కాంగ్రెస్ పాలనను రాముడి పాలనతో పోలుస్తూ.. రాముడి పాలన కావాలా.. రావణుడి పాలన కావాలా? అనేది ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధిగా 20 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా రేవంత్‌రెడ్డి శనివారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో పర్యటించారు. ముందుగా నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే ఆత్మీయులతో ముచ్చటించారు. ఆ తర్వాత డీసీసీబీ మాజీ చైర్మన్ ధ్యాప గోపాల్‌రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మిడ్జిల్ మండలంలోని 40 గ్రామ పంచాయతీలకు రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.20 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా ఊర్కొండ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లతో శిలాఫలకం ఆవిష్కరించారు. సుమారు రూ.17 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ కృతజ్ఞత వందన సభలో మాట్లాడారు.

**ఏం చేశారని మీకు లక్షల కోట్లు వచ్చాయి?**

'పదేళ్లలో ఏం వ్యాపారం చేశారని మీకు, మీ కుటుంబాలకు లక్ష కోట్లు వచ్చాయి. తెలంగాణకు రూ.8.21 లక్షల కోట్ల అప్పులు ఎలా మిగిలాయి? బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఫామ్‌హౌస్‌లో పండించిన గంజాయి, డ్రగ్స్‌ను రైతు బజార్లలో పెట్టి అమ్ముతారు. మీతో పాటు పాటు దోపిడీ చేసిన ఆఫీసర్లను నిన్న మొన్న ఏసీబీ ఆఫీసర్లు పట్టుకుంటున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.100 కోట్లు, రూ.200 కోట్లు, రూ.300 కోట్ల అక్రమ సంపాదన బయట పడుతోంది. వీళ్లకు ఈ సొమ్ము ఎక్కడిది? ప్రజల నుంచి దోచుకున్నదే కదా. కేసీఆర్‌కు గజ్వేల్, ఎర్రవల్లిలో వెయ్యి ఎకరాల ఫాంహౌస్ ఎక్కడి నుంచి వచ్చింది? కేటీఆర్‌కు జన్వాడలో వంద ఎకరాలు, హరీశ్‌రావుకు మొయినాబాద్‌లో 50 ఎకరాలు, కల్వకుంట్ల కవితకు శంకర్‌పల్లిలో 25 ఎకరాల ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయి? నీ షడ్డకుడి కొడుకు సంతోష్‌రావుదైతే లెక్కలు చెప్పనికే లేదు. ఇంత సంపాదన ఈ పదేళ్లలో ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడివి ఈ ఆస్తులు? ఎక్కడ సంపాదించారు. ఎందుకు తెలంగాణ అప్పుల పాలైంది? బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు దండుకున్న దుర్మార్గులు, నీచులు. వాళ్ల సంపాదన, దోపిడీ, దొంగతనాలు ఆగిపోయాయనే మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారు. అప్పులు, తప్పులు చేసినవాళ్లు మళ్లీ వస్తే రాష్ట్రంలో ఫోన్ కూడా స్వేచ్ఛగా మాట్లాడుకోలేరు. ఆడబిడ్డల మాటలు దొంగతనంగా వినేవాడు అసలు మనిషా? అసెంబ్లీకి రాడు.. ప్రజాసమస్యలు ప్రస్తావించడు. అధికారం ఇస్తే దోచుకోవడానికి మాత్రం వస్తాడట. పదేళ్లలో రాష్ట్రంలో ఆయన చేసింది ఏమంటే ఇసుక దోపిడీకి అడ్డుపడిన నేరెళ్ల దళితులపైకి లారీలు ఎక్కించుడు. పండించిన పంటకు గిట్టుబాటు ధర అడిగినందుకు ఖమ్మం జిల్లాలో రైతులకు బేడీలు వేసి జైళ్లలో పెట్టించుడు. ప్రశ్నలు, ప్రశ్నపత్రాలను పల్లీ, బఠానీల మాదిరి అమ్ముకున్నారు. నిధులు, నీళ్లు, ఉద్యోగాలు ఇవ్వలేదు. ఆ పశుపతి ఫామ్‌హౌస్‌లోనే కుంగికృశించి పోవాల్సిందే. అధికారం అనేది ఇక వాళ్లు మరిచిపోవాల్సిందే. నల్లమల నుంచి వచ్చిన నాకు ఏమీ తెలియదని కొందరు అవహేళన చేశారు.

## సెయింట్ జార్జ్ విద్యార్థులకు ఎన్‌సిసి 'ఏ' సర్టిఫికెట్లు ప్రధానం



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్ఈ) విద్యార్థులు ఎన్‌సిసి 'ఏ' సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. 2024లో కోర్సులో చేరిన విద్యార్థులు రెండు సంవత్సరాల పాటు క్రమశిక్షణతో శిక్షణ పొంది, ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పరీక్షలో విజయవంతమయ్యారు. శనివారం జరిగిన సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో పాఠశాల చైర్మన్ డా. పి. ఫాతిమా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి భావనలు పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ అందించిన ఎన్‌సిసి కేర్‌టేకర్ దివ్య, రాజు సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సర్టిఫికెట్ పొందిన వారిని అభినందించారు.

## మెగా ఉచిత వైద్య శిబిరం




**హుస్నాబాద్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, కరీంనగర్ సీవీఎం హాస్పిటల్ సౌజన్యంతో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి పైగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ప్రమాదాల్లో కాళ్లు కోల్పోయిన వారికి కృత్రిమ కాళ్ల అమరిక, కంటి పరీక్షలు కూడా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్ మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించిన ఆలయ ఫౌండేషన్ చైర్మన్ పరికిపండ్ల నరహరి, ఐఏఎస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతపూల అనిల్, మాజీ సర్పంచ్ వంగర మల్లేశం, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, సీవీఎం హాస్పిటల్ చైర్మన్ డా. బాట్ల శ్రీధర్, డా. బాట్ల సునీత, డా. బచ్చు అనుదీప్, డా. శ్రీధర్ రెడ్డి, ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా డీసీసీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన మామిడి తిరుపతి గౌడ్



**హుస్నాబాద్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్‌కు చెందిన మామిడి తిరుపతి గౌడ్‌ను సిద్ధిపేట జిల్లా డీసీసీ కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించింది. ప్రస్తుతం సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఆయన, పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. తన నియామకం పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి గౌడ్ పార్టీ అధిష్టానం, ముఖ్యంగా మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షులు, మండల నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల్లో తరగతులు నిర్వహించవద్దు - దేవదాస్



**ఖానాపూర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల్లో తరగతులు నిర్వహించవద్దని ఖానాపూర్ ప్రత్యేక అధికారి దేవదాస్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్డిఓ దేవదాస్ 5వ వార్డ్‌లోని ప్రాథమిక పాఠశాల బస్టాండ్ స్కూల్, శాంతినగర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, శిథిలావస్థలో ఉన్న భవనాలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. కొత్త పాఠశాల గదుల నిర్మాణానికి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపి త్వరలో మంజూరు చేయిస్తామని తెలిపారు. మున్సిపల్ కార్మికులతో పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రాథోడ్, మండల తహసీల్దార్, మున్సిపల్ సిబ్బంది, 5వ వార్డ్ కౌన్సిలర్ మేస పోసమ్మ, సతీష్, ఉపాధ్యాయులు దాసరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం – మారం జగదీశ్వర్





**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉద్యోగుల సంక్షేమం, ఆరోగ్య భద్రత, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, త్వరలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు ఉన్నతస్థాయి సమావేశం జరగనుందని, ప్రముఖ ఆసుపత్రులతో చర్చలు పూర్తయ్యాయని వెల్లడించారు. పీఆర్సీ, డీఏ, పెండింగ్ బకాయిల చెల్లింపుల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, ఉద్యోగులకు ఎలాంటి నష్టం జరగకుండా నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. సీపీఎస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉద్యోగులపై ప్రభుత్వం ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేలా అన్ని చర్యలు తీసుకుంటామని, సభ్యత్వం సంఘ బలం, ఐక్యతకు ప్రతీక అని మారం జగదీశ్వర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్ సింగ్, మారుపాక రాజేష్ భరద్వాజ్, వెలిచాల సుమంతరావు, పెండ్యాల కేశవరెడ్డి, కోట రామస్వామి, శంకర్, లవ కుమార్, అస్గర్ అలీ, కరుణాకర్, నారాయణ, మర్రి శ్రీనివాస్, బాలాజీతో పాటు వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు, జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి: సీఎస్ సంజయ్ జాజు




**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రతి జిల్లాకు రాష్ట్ర, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి వాటి సాధనకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన వ్యవసాయం, తాగునీరు, ఆరోగ్యం, విద్య, వాతావరణ పరిస్థితులపై సమీక్ష చేశారు. చిన్న జిల్లాల్లో పరిపాలన సమర్థవంతంగా సాగుతుందని, అధికారులు అద్భుత ఫలితాలు సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులకు వర్షపాతం వివరాలు, వాతావరణ హెచ్చరికలు ఎస్ఎంఎస్‌ల ద్వారా పంపాలని, యూరియా నిల్వలు తగినంతగా ఉన్నాయని, వృథా కాకుండా వినియోగించేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటలు, ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, బోనస్ అందిస్తున్న వరివంగడాలపై రైతులకు స్పష్టమైన సమాచారం చేరేలా చూడాలని ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు యాంటీ లార్వా కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని సూచించారు. గర్భిణుల జాబితా ముందుగానే సిద్ధం చేసి వారిని ఆరోగ్య సిబ్బంది నిరంతరం ఫాలోఅప్ చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పైప్‌లైన్ లీకేజీలను నివారించి నీటి వృథాను అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖలో మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలని, ప్రతిరోజూ విద్యార్థులు, ఉపాధ్యాయులు తీసుకున్న వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, విద్యా, వైద్య, వ్యవసాయ, రూరల్ వాటర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మైసమ్మ ఆలయంలో హుండీ చోరీ



**పెద్దపల్లి, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ మినీ ట్యాంక్ బండ్ పక్కన ఉన్న కట్ట మైసమ్మ తల్లి దేవాలయంలో గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి హుండీని పగులగొట్టి అందులోని నగదును అపహరించారు. దేవాలయ నిర్వాహకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, నిన్న రాత్రి దొంగలు ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగులగొట్టి సొమ్మును దోచుకెళ్లారని తెలిపారు. గతంలో కూడా ఇదే తరహా చోరీ జరిగినట్లు గుర్తుచేస్తూ, పోలీసులు రాత్రివేళల్లో నిఘా మరింత పెంచాలని ఆయన కోరారు.

## జూలై 6న ప్రారంభం కానున్న పెద్దమ్మతల్లి జాతర



**ఖానాపూర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో గల సింగపూర్ పెద్దమ్మతల్లి జాతరను సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి విగ్రహాల ఊరేగింపు చేపడతారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ పెద్ద పండుగకు రాజుర, పెంబి, దస్తురాబాద్, నిర్మల్, కడెం మండలాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు. పెద్దమ్మతల్లి విశిష్టతగా, రైతులు పంట వేసే ముందు కోళ్లు, మేకలు బలి ఇచ్చి, పంట దిగుబడి వచ్చిన తర్వాత ధాన్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ జాతర ఆలయ పూజారులు లింగన్న, భీమేష్ ఆధ్వర్యంలో జరుగుతుందని కమిటీ తెలిపింది. జాతర రోజున పెంబి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తారు.

## అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కుమారుడికి అభినందనలు



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కుమారుడు వి. శ్రేయస్ రెడ్డి జాతీయస్థాయి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు పొందాడు. ఈ సందర్భంగా శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు నరేందర్ రెడ్డి నివాసంలో శ్రేయస్ రెడ్డిని అభినందించారు. వారు మాట్లాడుతూ ఏకాగ్రత, శ్రద్ధతో విజయాలను సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలవవచ్చని పేర్కొన్నారు. శ్రేయస్ రెడ్డి ఐఐఐటి బెంగళూరు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఐఐటి బాంబే కెమికల్ ఇంజనీరింగ్‌లో సీట్లు పొందడమే కాకుండా బిట్స్ పిలానీ ప్రవేశానికి కూడా అర్హత సాధించాడు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరహరి, కెప్టెన్ మధుసూదన్ రెడ్డి, కన్న కృష్ణ, డాక్టర్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కొమరవెల్లి వెంకటేశం తదితరులు పాల్గొని నరేందర్ రెడ్డి, వనజా నరేందర్ రెడ్డిని అభినందించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలపై బండి సంజయ్ తీవ్ర విమర్శలు



**వేములవాడ, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హిందువుల ఓట్లను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్‌తో కుమ్మక్కై కుట్రలు చేస్తున్నదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఆరోపించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ రూ. 8.21 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ రెండున్నరేళ్లలోనే రూ. 1.77 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆయన మండిపడ్డారు. ఇరు పార్టీల పాలనల వల్ల రాష్ట్రం రూ. 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, జీతాలు, పెన్షన్లు, ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించడానికి కూడా పైసల్లేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. గత ఏడేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి రూ. 22 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులు తెచ్చినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణం, జాతీయ రహదారుల విస్తరణకు రూ. 10 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని, కరీంనగర్--వరంగల్ నేషనల్ హైవే పనులు దసరా నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ జీవితంలో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుండి బయటపడేసి అవినీతి రహిత అభివృద్ధి సాధించాలంటే "డబుల్ ఇంజన్ సర్కార్" అవసరమని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

## నరేంద్ర–వివేక–కేశవ–మాధవ ప్రతిభా పురస్కారాలు అందజేత



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో నరేంద్ర--వివేక--కేశవ--మాధవ ప్రతిభా పురస్కారాలను విద్యార్థులకు అందజేశారు. ప్రతి సంవత్సరం జూలై 4న స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద మహాసమాధి దినాన్ని పురస్కరించుకొని ఈ పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు మొదటి ర్యాంకు సాధించిన వారికి రూ. 1,116, రెండవ ర్యాంకు వారికి రూ. 816, మూడవ ర్యాంకు వారికి రూ. 616 నగదు బహుమతులు, ప్రతిభా పత్రాలు అందజేశారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు మొదటి ర్యాంకు సాధించిన వారికి రూ. 2,116, రెండవ ర్యాంకు వారికి రూ. 1,516, మూడవ ర్యాంకు వారికి రూ. 1,316 నగదు బహుమతులు, ప్రతిభా పత్రాలు అందించారు. ప్రతిభా పత్రాలపై స్వామి వివేకానంద సూక్తి లేచి నిలబడు! మేల్కొను! లక్ష్యం చేరేవరకు ఆగవద్దు ముద్రించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా సి.ఏ. నిరంజన చారి అల్లూరి సీతారామరాజు గొప్పతనాన్ని వివరించారు. ఇంజనీర్ కోల అన్నారెడ్డి, కొమ్మెర ప్రవీణ్ కుమార్ రెడ్డి, కోల రామచంద్ర రెడ్డి, కొలుగూరి సదాశివ రెడ్డి, దేవరకొండ లక్ష్మణ్ మూర్తి, గుగ్గిళ్ల రమేష్, గుజ్జ శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ ఈ వివరాలను వెల్లడించారు.

## బంగారు పతకం సాధించిన వాగేశ్వరి కళాశాల విద్యార్థిని స్వప్నిక




**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక వాగేశ్వరి కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విరంచి స్వప్నిక చెన్నైలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలలో జేఎన్టీయూ తరపున ప్రాతినిధ్యం వహించి 84 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించింది. ఈ విజయంపై పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. దామోదర్, సభ్యులు ఏ. శ్రీలత, ఎస్. శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, పి.జే. చంద్రశేఖర్, జి. శ్రీధర్ తదితరులు స్వప్నికను అభినందించారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓటరు సవరణ కమిటీ ఏర్పాటు



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ముగ్గురు సభ్యులతో కూడిన ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేసింది. డా. మేడిపల్లి సత్యం చైర్మన్‌గా, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి సభ్యుడిగా నియమితులయ్యారు. బీఎల్ఏ--2లకు న్యాయ సహాయం అందించేందుకు సీనియర్ న్యాయవాది తుమికి పవన్ కుమార్‌ను న్యాయ సలహాదారుగా నియమించారు.ఓటరు జాబితాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా బీఎల్ఏ--2లకు పూర్తి మద్దతు ఇవ్వాలని డీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ స్పష్టం చేసింది. నిజమైన ఓటర్లకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా సవరణ కార్యక్రమం కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## రైతుల సేవే విండోల లక్ష్యం కావాలి

▫ ఎమ్మెల్యే సత్యనారాయణ





**మానకొండూర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మానకొండూర్ సింగిల్ విండో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విండో చైర్మన్‌గా నాగిశెట్టి రాజయ్య, డైరెక్టర్లుగా ఏనుగుల చొక్కారెడ్డి, కత్తెర్ల రాజు, మంగురపు నర్సవ్వ, సుధగోని తిరుపతి గౌడ్, గాలి మొగిలి, కొట్టె అంజిరెడ్డి, ఎం. రామకృష్ణ, దూలం దేవేంద్ర, కొలిపాక మొగిలి, బుర్ర శ్రీకాంత్, కుర్ర వెంకటస్వామి, ఏగోళపు శ్రీనివాస్ గౌడ్‌లకు జిల్లా సహకార శాఖ సీనియర్ రిజిస్ట్రార్ శైలజ ప్రమాణం చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సింగిల్ విండో వ్యవస్థ ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, పంటల బీమా వంటి సేవలను పారదర్శకంగా అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికే పెద్దపీట వేస్తోందని, రైతు భరోసా కింద ఎకరానికి ఏటా రూ.12,000 పెట్టుబడి సాయం, రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేస్తున్నదని తెలిపారు.మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అవినీతికి తావు లేకుండా, రాజకీయాలకు అతీతంగా విండోలు పని చేయాలని ఆయన హితవు పలికారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, బుర్ర శ్రీధర్, ఇర్ఫాన్, కోండ్ర సురేష్, కొత్తకొండ శంకర్, సాయిరి దేవయ్య, గొల్లెన కొమురయ్య, తమిశెట్టి రాజేశ్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల నూతన పాలకవర్గాలు ఏర్పాటు



**తిమ్మాపూర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూర్ నియోజకవర్గంలోని పలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ప్రభుత్వం నియమించిన కొత్త పాలకవర్గాలు శనివారం ప్రమాణ స్వీకారం చేశాయి.తిమ్మాపూర్ మండలంలోని పోరండ్ల, నుస్తులాపూర్, శంకరపట్నం మండలంలోని తాడికల్, మెట్‌పల్లి, గద్దపాక సింగిల్ విండోలకు చైర్మన్లు, డైరెక్టర్లు నియమితులయ్యారు. పోరండ్లలో గోపు మల్లారెడ్డి చైర్మన్‌గా, నుస్తులాపూర్‌లో మోరపల్లి రమణారెడ్డి చైర్మన్‌గా, తాడికల్‌లో కీసర సంపత్ చైర్మన్‌గా, మెట్‌పల్లిలో గాజుల మహేశ్ చైర్మన్‌గా, గద్దపాకలో గోపగోని బస్వయ్య చైర్మన్‌గా ప్రమాణం చేశారు.ఈ కార్యక్రమాల్లో మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పీసీసీ నాయకులు, సర్పంచులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వ్యసనంతో మహిళను కిడ్నాప్ చేసిన నిందితుడు అరెస్ట్




**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో భారీగా డబ్బులు నష్టపోయి అప్పుల ఒత్తిడితో మహిళను కిడ్నాప్ చేసి దోపిడీ, హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు.జూలై 1న టవర్ సర్కిల్ వద్ద కూలీ పనికి వేచి ఉన్న గంగాధర లక్ష్మి అదృశ్యమైన ఘటనపై మొదట మిస్సింగ్ కేసు నమోదు కాగా, దర్యాప్తులో ఆమెను కిడ్నాప్ చేసి బంగారు ఆభరణాలు దోచి బావిలో పడేసినట్లు బయటపడింది. బాధితురాలు తాడును పట్టుకుని ప్రాణాలు కాపాడుకోగా, మరుసటి రోజు రైతులు ఆమెను రక్షించారు.నిందితుడు ధమ్మ దినేష్ రెడ్డి ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, లోన్ యాప్‌లకు బానిసై రూ.4 లక్షలు నష్టపోయి ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజ్, సెల్‌ఫోన్ విశ్లేషణ ఆధారంగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. దోచుకున్న బంగారు ఆభరణాలను నగల వ్యాపారికి విక్రయించినట్లు విచారణలో తేలింది. పోలీసులు ఆ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేస్తూ ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, అక్రమ బెట్టింగ్ యాప్‌లు వ్యక్తులను ఆర్థికంగా, మానసికంగా దెబ్బతీసి తీవ్రమైన నేరాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. కూలీలు అపరిచితులను నమ్మి ఒంటరిగా వెళ్లవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కేసును ఛేదించిన ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రామచందర్ రావు, తిరుమల్, ఎస్సైలు సుమన్, చేరాలు, భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్, కానిస్టేబుళ్లు లక్ష్మీపతి, రాజ్‌కుమార్, ప్రశాంత్‌లను పోలీస్ కమిషనర్ అభినందించారు.

## వానాకాలం పంట కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం

▫ పౌరసరఫరాల శాఖ శ్యాం ప్రసాద్ లాల్




**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రానున్న వానాకాలం పంట కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సంచాలకులు శ్యాం ప్రసాద్ లాల్ తెలిపారు.కరీంనగర్ కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సంస్థ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. గత యాసంగిలో అధికారులు, మిల్లర్ల సమన్వయంతో రాష్ట్రంలో 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ వానాకాలంలోనూ 80 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేస్తున్నామని ఆయన వివరించారు.సీఎంఆర్ లక్ష్యాలను సకాలంలో చేరుకోవడానికి మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైతే పని గంటలను పెంచి నిరంతరాయంగా మిల్లింగ్ కొనసాగించాలని సూచించారు. ప్రతి మిల్లుకు మానిటరింగ్ అధికారిని నియమించి, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సంస్థ మేనేజర్లు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే చెల్లించాలని డిమాండ్



**పెద్దపల్లి, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర పిలుపు మేరకు జూలపల్లి మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే చెల్లించాలని, పిఆర్సి రిపోర్టు తెప్పించి కొత్త పిఆర్సి అమలు చేయాలని ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలపై డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెవేని జగన్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మూల శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయ సంఘం సభ్యులు పాల్గొన్నారు. లోక శ్రీనివాస్ రెడ్డి, మామిడి బుచ్చిబాబు, వెంకటరమణ, శంభోజి రాజేష్, పిట్టల లచ్చన్న, రాయమల్లు, బైరి సత్యనారాయణ, వీరమల్లు, సామల కిరణ్, అశోక్ రాజు, శ్రీకాంత్ రెడ్డి, శంకర్, రాజు తదితరులు హాజరయ్యారు.

## వార్డ్ సభ్యులకు గౌరవ వేతనం కోరుతూ అమ్రాబాద్ పంచాయతీ తీర్మానం



**అమ్రాబాద్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వార్డ్ సభ్యుల కష్టానికి తగ్గ గౌరవం ఇవ్వాలని అమ్రాబాద్ గ్రామపంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వార్డ్ సభ్యులకు గౌరవ వేతనం మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం పంపేందుకు నిర్ణయం తీసుకున్నారు. వేతనం లేకుండా ప్రజాసేవ చేస్తున్న వార్డ్ సభ్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనీసం గౌరవ వేతనం అందించాలని సభ్యులు డిమాండ్ చేశారు.తీర్మాన ప్రతిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామన్నకు వినతిపత్రంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజారాం, వార్డ్ సభ్యులు అక్రమ్, జానీ, బురాన్, రజిత, ఈదమ్మ, పద్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.పంచాయతీ సభ్యులు ప్రభుత్వం స్పందించి వార్డ్ సభ్యులకు తక్షణమే గౌరవ వేతనం ప్రకటించాలని కోరారు.

## గ్రామాలకు ఇచ్చే నిధులన్నీ కేంద్రానివే:బండి సంజయ్



**జగిత్యాల, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామ పంచాయతీల అభివృద్ధికి వచ్చే నిధులన్నీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.కథలాపూర్ మండలం గంభీర్‌పూర్, పోసానిపేట, ధూంపేట్ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు నిధులు ఇవ్వడం లేదని, కేంద్రం ఇచ్చే నిధులను పంచాయతీ సిబ్బంది జీతాల కోసం డైవర్ట్ చేస్తూ అభివృద్ధిని కుంటుపరుస్తోందని ఆరోపించారు. గ్రామాల ఉజ్వల గ్యాస్, మరుగుదొడ్ల నిర్మాణం వంటివన్నీ కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిధుల మళ్లింపుపై కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. గంభీర్‌పూర్ గ్రామస్తులు కోరిన తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## విద్యార్థి దశలో చట్టాలపై అవగాహన అవసరం



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తిమ్మాపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతి బా పూలే బాలికల కళాశాలలో జూనియర్ సివిల్ జడ్జి బానోత్ రాజేశ్వర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి దామెర్ల ప్రీతి విద్యార్థులతో చట్టాలపై అవగాహన కల్పించారు.విద్యార్థి దశలోనే రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, విధులు తెలుసుకోవడం అవసరమని, సమాజంలో సమానత్వం కోసం చట్టం కీలకమని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాలలో అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎలాంటి న్యాయ సహాయం అందించడానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేష్, శ్రీపతి భావన, ఎల్.ఎం.డి కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ రమేష్, కళాశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్‌లో హౌస్ ఎన్నికలు



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్‌లో వార్షిక ప్రణాళికలో భాగంగా హౌస్ ఎన్నికలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకమని, వాటి ద్వారా ప్రజలకు వనరులు, న్యాయం లభిస్తాయని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులను నాలుగు విభాగాలుగా విభజించి లక్ష్య, సరస్, తేజస్, ధ్రువ హౌస్‌ల కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించి ఎన్నికల వాతావరణాన్ని తలపించేలా ప్రచారం చేశారు.ఓట్ల లెక్కింపు ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేసి, ఫలితాలను ప్రకటించి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ కనువిప్పు కోసమే కేటీఆర్ పర్యటన



**మంథని, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గోదావరి నదిలో వృథాగా పోతున్న నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు.ఈ నెల 5న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కన్నెపల్లి పంపుహౌజ్‌ను సందర్శించనున్న నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మేడిగడ్డ బరాజ్ పిల్లర్లు దెబ్బతిన్నాయన్న సాకుతో ప్రభుత్వం రెండేళ్లుగా నీటిని ఆపడం లేదని, కానీ కన్నెపల్లి పంపుహౌజ్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని తెలిపారు.ప్రతి రోజు ఒక టీఎంసీ నీరు వృథాగా పోతున్నా ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని ఆయన అన్నారు. నీటిని ఆపకపోవడం వల్ల భూగర్భజలాలు అడుగంటి పోయి రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకే కేటీఆర్ పర్యటన చేపడుతున్నారని, నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు.

## సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలి



డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

**సిద్ధిపేట, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేసి జిల్లాల వారీగా, రైస్ మిల్లుల వారీగా నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ ఆదేశించారు.సిద్ధిపేట కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎఫ్‌సీఐ అధికారులు స్టాక్ కేటాయింపులు, ఆన్‌లైన్ అనుమతులు, గోదాములలో స్థల లభ్యత వంటి అంశాల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక సామర్థ్యం కలిగిన రైస్ మిల్లులకు అదనపు స్టాక్‌లు కేటాయించి డెలివరీలను వేగవంతం చేయాలని తెలిపారు.ఖరీఫ్ 2025-26 సీజన్‌లో 2,76,058 మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గాను 48.18 శాతం, రబీ 2025-26 సీజన్‌లో 1,57,052 మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గాను 13.98 శాతం సీఎంఆర్ డెలివరీ పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అధికారులు, రైస్ మిల్లర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి, పౌర సరఫరాల అధికారి తనుజ, మేనేజర్ గోపికృష్ణ, ఎఫ్‌సీఐ అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గురుకుల బాలికల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం



**హుస్నాబాద్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బెజ్జంకి బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సి.ఈ.సి--1, ఎం.ఈ.సి--1 కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి జూలై 6న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వీరలక్ష్మి తెలిపారు.ఆసక్తి గల విద్యార్థినులు ఉదయం 9 గంటలకు సిద్ధిపేట జిల్లా ములుగులోని టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఎస్.జె.సి సి.ఓ.ఈ బాలికల కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ఖాళీ సీట్లు మెరిట్ ఆధారంగా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.

## బొడ్రాయి పున ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామంలో జరిగిన బొడ్రాయి పున ప్రతిష్టాపన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో వారు గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కోరుకున్నారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు విచ్చేసిన వారిని శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ పాలకవర్గం, స్థానిక నాయకులు, బిఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమక్షంలో న్యాయ విజ్ఞాన సదస్సు




**పెద్దపల్లి, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దబొంకూర్, కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టం, సైబర్ లాస్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు లేని చిన్న పిల్లలు, మతి స్థిమితం లేని పిల్లలు కనుగొనబడితే వారికి ఆధార్ కార్డు, ఫుడ్ సేఫ్టీ కార్డు, ప్రభుత్వ పథకాల సదుపాయాలు న్యాయ సేవ సంస్థ ద్వారా అందించబడతాయని అధికారులు తెలిపారు. సదస్సులో జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ నుచు శ్రీనివాస్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ భాను కృష్ణ, పెద్దబొంకూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, కొత్తపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధురి, న్యాయ సేవ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

**నందికొట్కూరు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య శనివారం బొల్లవరం వెళ్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డిని పరామర్శించారు.ఇటీవల మోకాళ్ల నొప్పుల కారణంగా శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో పాటు టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి కూడా పరామర్శించారు.



## కోర్టును తరలించొద్దని బీఆర్ఎస్ నాయకుల వినతి



**హుస్నాబాద్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉన్న కోర్టును జిల్లెలగడ్డ గ్రామ పరిధికి తరలించకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఆర్డీవో రామమూర్తికి వినతిపత్రం సమర్పించారు.నాయకులు మాట్లాడుతూ సుమారు 22 సంవత్సరాల క్రితం ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పట్టణంలో కోర్టు భవనం నిర్మించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్త కోర్టు భవనాల నిర్మాణం పేరుతో పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని జిల్లెలగడ్డలో నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోందని తెలిపారు.ప్రస్తుతం కోర్టు ఉన్న ప్రదేశంలోనే ఒక ఎకరం 30 గుంటల స్థలం అందుబాటులో ఉందని, అక్కడే ఆధునిక కోర్టు భవనాలను నిర్మించాలని కోరారు. ఇతర ప్రాంతాల్లో పాత కోర్టులను అదే ప్రదేశంలో అభివృద్ధి చేసినప్పటికీ హుస్నాబాద్ కోర్టును బయటకు తరలించడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని పేర్కొన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకుని కోర్టును ప్రస్తుతం ఉన్న ప్రదేశంలోనే కొనసాగించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, సూరంపెల్లి పరశురాములు, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, భూక్యా తిరుపతి, మాటూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు: విగ్రహం ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలని డిమాండ్



**కరీంనగర్ /సుల్తానాబాద్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అధికారికంగా కార్యక్రమాలు జరిగాయి. కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో జిల్లా కురుమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు కడారి అయిలన్న ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై, అలాగే అన్ని జిల్లా కేంద్రాల్లో నెలకొల్పాలని డిమాండ్ చేశారు.కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో కలెక్టర్ చిత్రా మిశ్రా ఆయన పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని అన్నారు.పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో తాళ్లపల్లి మనోజ్ గౌడ్ మాట్లాడుతూ 19 ఏళ్ల వయసులోనే వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి అమరుడైన తొలి వ్యక్తి దొడ్డి కొమురయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికారులు, కురుమ సంఘం నాయకులు, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళా సంఘం నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్ కు ఆహ్వానం



**మంచిర్యాల, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 2026--27 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గ్రూపులలో ఖాళీల భర్తీకి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు సమన్వయకర్త రామ కళ్యాణి తెలిపారు. జిల్లాలోని బాలురకు జైపూర్, బాలికలకు లక్షెట్టిపేటలోని గురుకుల జూనియర్ కళాశాలలో జూలై 6న ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్ జరుగనుంది. అర్హత కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నకలు ప్రతులతో హాజరుకావాలని సూచించారు.ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు రిజిస్ట్రేషన్, మధ్యాహ్నం 1 గంటకు మెరిట్ జాబితా, 2 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు. ఎస్ఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెరిట్, కుల ప్రాతిపదికన అడ్మిషన్లు కల్పిస్తారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.1.5 లక్షలు లోపు ఉండాలని, తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు.అడ్మిషన్ పొందిన విద్యార్థులు మరుసటి రోజు కళాశాలలో చేరాలని, జూలై 10లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించని యెడల అడ్మిషన్ రద్దు అవుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా వివేకానంద వర్ధంతి వేడుకలు




**హుస్నాబాద్ నియోజకవర్గం, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బందెల సుజాత బాలకిషన్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువశక్తి దేశ అభివృద్ధిలో కీలకమని, వివేకానంద సందేశం విద్యార్థులకు మార్గదర్శకమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఘనంగా నివాళు లర్పించారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తపస్ డిమాండ్




**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కరీంనగర్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది.జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు ఆధ్వర్యంలో గ్రామీణ, అర్బన్ తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. పిఆర్సి అమలు, పెండింగ్ డీఏల ప్రకటన, కుబేర్‌లో పేరుకుపోయిన బిల్లులకు నిధుల మంజూరు, పెన్షనర్ల బిల్లుల చెల్లింపులు, సిపిఎస్ రద్దు, కేజీబీవీ, మోడల్, గురుకుల ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం గ్రాంట్ల మంజూరు వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు బుర్ర నాగరాజు, చేరాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జోరందుకున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ



**అంబర్పేట, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సర్‌లో భాగంగా అంబర్పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ జోరందుకుంది. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె రూబీ స్టీవెన్‌సన్ స్థానికులకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ఫారాలను తప్పులు లేకుండా నింపి బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని సూచించారు. లేనిపక్షంలో వారి ఓట్లు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుని తమ ఓట్లను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జి. వరలక్ష్మి, తిరుపతి గుప్తా, బిఎల్వో షేక్ ఇక్బాల్, మహ్మద్ వాజిద్, సాజిద్ ఖాన్, బిఎల్వో రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఆవరణలో నూతన అంబులెన్స్ ప్రారంభం



**పెద్దపల్లి, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ప్రభుత్వ విప్ విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్ సింగ్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## హోంగార్డుల వార్షిక రొటేషన్ బదిలీలు పారదర్శకంగా పూర్తి



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డుల వార్షిక రొటేషన్ బదిలీల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ముగిసిందని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.జూన్ 25న ప్రకటించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా బదిలీలను పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. కమిషనరేట్ అస్త్ర సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో మినహాయింపుల జాబితాను భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించి, మిగిలిన సిబ్బందికి లాటరీ ద్వారా స్థానాలను కేటాయించారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 373 మంది హోంగార్డులు బదిలీ అయ్యారు. సిరిసిల్ల, జగిత్యాల, రామగుండం, వరంగల్, భూపాలపల్లి, సిద్ధిపేటలతో పాటు కరీంనగర్‌లోనూ బదిలీలు జరిగాయి.ఈ కార్యక్రమంలో హోంగార్డుల కమాండెంట్ వెంకటేశ్వర్లు, అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వేణుగోపాల్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్, కిరణ్, ఇతర అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు.

# భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ ఎన్యూమరేషన్ పరిశీలన



**సుల్తానాబాద్/హుస్నాబాద్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్, హుస్నాబాద్ పట్టణాల్లో ఓటర్ ఎన్యూమరేషన్ పరిశీలన జరిగింది.సుల్తానాబాద్ 7వ వార్డులో కౌన్సిలర్ వూట్ల వరప్రదీప్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఆఫీసర్లు, ఏజెంట్లు ప్రజలకు అవగాహన కల్పించి ఓటు నమోదు, దొంగ ఓట్ల తొలగింపు పై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.హుస్నాబాద్ 3వ వార్డులో కౌన్సిలర్ కొండ రజిత సత్యనారాయణ పరిశీలనలో ప్రత్యేక ఓటరు నమోదు ధ్రువీకరణ కార్యక్రమం జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని, ఇప్పటికే పేరు ఉన్నవారు వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేసుకోవాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు ఓటర్ల వివరాలు సేకరించి కొత్త నమోదులు, చిరునామా మార్పులు, సవరణలు చేపట్టారు. ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా నమోదు, సవరణలు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మాజీ మంత్రి, గవర్నర్‌గా సేవలందించిన దివంగత కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో వివిధ ప్రాంగణాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. డిసిసి కార్యాలయం, కలెక్టరేట్ ఆడిటోరియం, నగరపాలక సంస్థ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, వైశ్య సంఘాల ప్రతినిధులు రోశయ్య సేవలను స్మరించారు. ఆయన ఆర్థిక మంత్రిగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సమర్థంగా నడిపి రికార్డు బడ్జెట్లు ప్రవేశపెట్టారని, ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలనకు పెద్దపీట వేశారని కొనియాడారు. వైశ్య సంఘాల నాయకులు ఆయనను వైశ్య పితామహుడుగా అభివర్ణిస్తూ, ప్రజాసేవలో ఆయన చూపిన అంకితభావం భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు, సంఘాల ప్రతినిధులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

## సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు శ్రీకారం



**కరీంనగర్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్‌లో రూ.41 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.మేయర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కొత్త పైప్‌లైన్ మంజూరు చేసినట్లు, వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా మురుగు కాలువల పూడికతీత పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.నగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రూ.50 కోట్ల ఉడెఫ్ నిధులతో 66 డివిజన్లలో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. 49వ డివిజన్ అభివృద్ధి కోసం అదనంగా రూ.50 లక్షలు కేటాయించామని, త్వరలో ఆ పనులు కూడా ప్రారంభమవుతాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్, ఇతర కార్పొరేటర్లు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 118 సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**డోన్, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డోన్ పట్టణంలో ప్రజల భద్రత, నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ప్రారంభించిన ఈ కంట్రోల్ రూమ్‌కు పట్టణంలోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 118 సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. వీటి ద్వారా రాకపోకలు, ప్రజా రద్దీ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించనున్నారు.ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాలను నియంత్రించేందుకు ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందిస్తే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా వారి ఇళ్లను సీసీ కెమెరాలతో పర్యవేక్షించే సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు.ప్రజల సహకారంతో డోన్ సబ్ డివిజన్‌ను మరింత సురక్షితంగా, ప్రశాంతంగా తీర్చిదిద్దేందుకు ఈ కంట్రోల్ రూమ్ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తి పెంపొందాలి


సీఐ వెంకటేశ్వర్లు



**ఆమనగల్లు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆమనగల్లు పట్టణంలోని మానస గార్డెన్‌లో అంబేద్కర్ యువజన సంఘం, బుద్ధా చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వర్, ప్రముఖ సంఘసేవకుడు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తొలుత గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు చెస్ వంటి మేధో క్రీడల్లోనూ రాణించాలని, ఇవి ఏకాగ్రత, సహనం, విశ్లేషణాత్మక ఆలోచన, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విజయాలు సాధించాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తి పెంపొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ఇలాంటి పోటీలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో చెస్ నేషనల్ ప్లేయర్, రిటైర్డ్ హెచ్ఎం గోపాల్‌రెడ్డి, చెస్ కోచ్ మల్లేష్, మీసాల రమేష్, అంబేద్కర్ యువజన సంఘం ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ లండం యాదయ్య, ఉపాధ్యక్షుడు వస్పుల సురేష్, జాయింట్ సెక్రటరీ ఎం.డి. అప్సర్, కోశాధికారి లండం గిరి, పసుపుల శేఖర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మద్దెల మల్లేష్, లండం మహేష్, లండం శివ, సంఘ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోశయ్య సేవలు చిరస్మరణీయం:గణేష్ బిగాల





**హైదరాబాద్ జూలై 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** స్వర్గీయ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల పాల్గొని రోశయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల మాట్లాడుతూ... ప్రజా జీవితంలో నిబద్ధత, నిరాడంబరత, నిజాయితీకి స్వర్గీయ రోశయ్య ఆదర్శప్రాయమైన నాయకుడని అన్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, వివిధ శాఖల్లో మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా సేవలందించిన ఘనత రోశయ్య దేనని కొనియాడారు. రాజకీయాలకు విలువలు తీసుకొచ్చిన నాయకుడిగా, పరిపాలనలో తనదైన ముద్ర వేసిన మహనీయుడిగా ఆయన ఎల్లప్పుడు ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో,రాజ్య అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రులు పొన్నం ప్రభాకర్ , గడ్డం వివేక్ ,నాయకులు కె.వి.పి. రామచందర్ రావు,ఎమ్మెల్యే గడ్డం వినోద్ ,ఎమ్మెల్యే దానం నాగేందర్ , వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత , కోలేటి దామోదర్ ,తెలంగాణా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఉప్పల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య



**హైదరాబాద్, జూలై 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్య 93వ జయంతిని పురస్కరించుకుని ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరావాది లక్ష్మి నారాయణ గుర్తు చేశారు. ఖైరతాబాద్ చింతల్‌బస్తీ లో తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర మహాసభ ఆధ్వర్యంలో కి. శే. కొణిజేటి రోశయ్య 93 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షులు అమరావాది లక్ష్మి నారాయణ గుప్త , గణేష్ గుప్తా చింతల రవికుమార్ గుప్త తదితరులు తో కలిసి రోశయ్య విగ్రహానికి పూల మాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు . ఈ సందర్భంగా అమరావాది లక్ష్మి నారాయణ గుప్త మాట్లాడుతూ.. రోశయ్య దేశ రాజకీయ వేత్తఅని అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం వేమూరులో 1933లో జన్మించిన ఆయన.. విద్యార్థి నాయకుడిగా ఎదిగారని తెలిపారు. 2009–2010 మధ్యకాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన రోశయ్య.. 2011–2016 వరకు తమిళనాడు గవర్నర్‌గా, కర్ణాటక రాష్ట్రానికి (అదనపు) గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పాటు రాజకీయాల్లో ఉంటూ, 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఏకైక ఆర్థిక మంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ పెద్దలు జిల్లా నాయకులు తదితరులు ఉన్నారు.

## రేవంత్ కృతజ్ఞత సభకు పోటెత్తిన ఆమనగల్లు కాంగ్రెస్ శ్రేణులు

- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన పట్టణ అధ్యక్షుడు మానయ్య



**ఆమనగల్లు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహా విజయోత్సవ కృతజ్ఞత బహిరంగ సభకు ఆమనగల్లు మున్సిపాలిటీ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో ఉదయం నుంచే పట్టణంలోని అన్ని వార్డుల నుంచి కార్యకర్తలు కాంగ్రెస్ జెండాలు చేతబట్టి, సీఎం రేవంత్ రెడ్డికి మద్దతుగా నినాదాలు చేస్తూ వాహనాల ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు విశేష ఆదరణ చూపుతున్నారని, ఆ ప్రజాభిమానానికి ప్రతీకగానే కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సభను విజయవంతం చేయడంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల నుంచి మహిళా నాయకులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వాహనాల్లో సభకు తరలివెళ్లారు. పార్టీ జెండాలతో, నినాదాలతో సాగిన ర్యాలీ పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తెల్లమల్ల జగన్, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, నాయకులు అబ్దుల్ అలీమ్, శేఖర్ గౌడ్, రాగ్యా నాయక్, సురేష్ నాయక్, శ్రీను నాయక్, నాజర్, దేవరశెట్టి మహేష్, గోపాల్, నిరంజన్, రవి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనమే లక్ష్యం



- సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి

**ఆమనగల్లు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలనే లక్ష్యంతో ఆకుతోటపల్లి గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి శనివారం జెడ్పీహెచ్ఎస్ ఆకుతోటపల్లి పాఠశాలకు అవసరమైన కొత్త వంట పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మధ్యాహ్న భోజనం తయారీలో వినియోగించే పాత్రలు శుభ్రంగా, నాణ్యంగా ఉంటేనే విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. అందుకే పాఠశాలకు అవసరమైన అన్ని వంట పాత్రలను కొత్తగా కొనుగోలు చేసి ప్రధానోపాధ్యాయులు చందూలాల్‌కు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు విజయ్ కుమార్, సాజిద్, మాజీ సర్పంచ్ రామచందర్, పూర్వ విద్యార్థి సెహ్వాగ్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మిడ్జిల్ సభకు తలకొండపల్లి నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు

- వాహనాలను ప్రారంభించిన ఏఎంసీ డైరెక్టర్ ఎండీ అజీమ్



**అమనగల్లు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానానికి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మిడ్జిల్ మండల కేంద్రంలో నిర్వహించిన కృతజ్ఞత సభకు తలకొండపల్లి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వాహనాల్లో బయలుదేరిన శ్రేణులను ఏఎంసీ డైరెక్టర్ ఎండీ అజీమ్ కాంగ్రెస్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2006లో మిడ్జిల్ జెడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఎ. రేవంత్ రెడ్డి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగి అదే ప్రాంతంలో కృతజ్ఞత సభ నిర్వహించడం చారిత్రాత్మకమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సభ విజయవంతం కోసం తలకొండపల్లి మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివెళ్లడం పార్టీపై ప్రజలకు ఉన్న ఆదరణకు నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ నాయకుడు మోహన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెన్నకేశవులు, యువజన కాంగ్రెస్ నాయకులు జూలపల్లి శ్రీనివాస్, మల్లేష్, శంకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు చేరాలన్నదే 'హర్ ఘర్ జల్' లక్ష్యం

- సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్




**ఆమనగల్లు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని రాంనుంతల గ్రామపంచాయతీలో శనివారం 'హర్ ఘర్ జల్' కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో, మిషన్ భగీరథ ఏఈ జయశ్రీ సమక్షంలో నిర్వహించారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని ప్రతి ఇంటికీ నిరంతరాయంగా అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మిషన్ భగీరథ పథకం ప్రాముఖ్యత, తాగునీటి వినియోగం, నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్ మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీరు ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీటిని అందిస్తోందన్నారు. ప్రజలు తాగునీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు నీటిని వృథా చేయకుండా కాపాడాలని సూచించారు. పైపులైన్‌లు, కుళాయిల వద్ద లీకేజీలు గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే ప్రతి ఇంటికీ నిరంతరాయంగా తాగునీరు అందించగలమని తెలిపారు. మిషన్ భగీరథ ఏఈ జయశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, స్వచ్ఛమైన తాగునీటి వినియోగంతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వరి మోహన్, వార్డు సభ్యుడు ధనరాజ్, గ్రామ కార్యదర్శి యాదగిరి, మాజీ వార్డు సభ్యుడు కృష్ణతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కంటి ఆరోగ్యానికి ఐక్యత భరోసా

- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి
- తలకొండపల్లిలో ఘనంగా ప్రారంభమైన మెగా ఉచిత కంటి వైద్య శిబిరం



**తలకొండపల్లి, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ (ఐటీశాఖ) సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో తలకొండపల్లిలోని శ్రీ దేవకి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఐదవ మెగా ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగనున్న శిబిరాన్ని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు భగవంతుడు ప్రసాదించిన అమూల్యమైన వరమని, చిన్నచిన్న కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ముందస్తుగా కంటి పరీక్షలు చేయించుకుని ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత రెండేళ్లుగా ఐక్యత ఆరోగ్య భరోసా కార్యక్రమంలో భాగంగా శంకర నేత్రాలయ, చెన్నై భాగస్వామ్యంతో నిర్వహించిన నాలుగు మెగా కంటి వైద్య శిబిరాల ద్వారా 569 మంది నిరుపేదలకు ఉచిత శుక్లాల శస్త్రచికిత్సలు నిర్వహించి, 10 వేల మందికి పైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఐదవ శిబిరంలో కూడా ఉచిత కంటి పరీక్షలు, కంటి అద్దాల పంపిణీతో పాటు శుక్లాల బాధితులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొబైల్ సర్జికల్ యూనిట్‌లో పూర్తిగా ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల ఆరోగ్యమే తమకు అత్యంత ప్రాధాన్యమని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని పేర్కొన్నారు. శిబిరానికి తలకొండపల్లి మండలం, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకోగా, వైద్యుల బృందం అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు అందించి, శస్త్రచికిత్స అవసరమైన వారిని నమోదు చేసింది. కార్యక్రమంలో శంకర నేత్రాలయ ఎన్ఆర్ఐ సభ్యుడు నారాయణ రెడ్డి, ఎంపీడీఓ ఎం. సీతారావమ్మ, సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## అన్న - అక్క మెంటర్షిప్ ఏఐ డిజిటల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్




**దేవరకొండ జూలై 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్), దేవరకొండలో "అన్న - అక్క మెంటర్షిప్ ఏఐ డ డిజిటల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ " కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో మంచి నైపుణ్యం ఏర్పడుతుందని, ప్రస్తుత ఏఐ తరుణంలో ఏఐ ఎంతగానో ఉపయోగపడుతుందని డిగ్రీ విద్యార్థులకు ఇదొక మంచి సువర్ణ అవకాశం మీరు నేర్చుకొని పాఠశాల విద్యార్థులకు బోధించడం ద్వారా మీకు కూడా పర్సనల్ డెవలప్మెంట్ అవుతుందని ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో అదనపు నైపుణ్యాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్లుగా జి.లింగారెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్, బి.సురేష్ లెక్చరర్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. కె.పృథు, ఎ.శ్రీను, వి.వెంకటేష్, వి. యాదయ్య, పి.కొండల్, ఎస్.నర్మదాదేవి, ఎం. జగపతి బాబు , కె.నాగరాజు తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల్లో నాయకత్వ వికాసానికి 'వాయిస్--4 గర్ల్స్'

- ప్రభుత్వ ఎస్టీ గురుకులంలో 10 రోజుల శిక్షణ విజయవంతం



**ఆమనగల్లు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించాలనే లక్ష్యంతో గిరిజన సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల ఆమనగల్లులో నిర్వహించిన 'వాయిస్--4 గర్ల్స్' శిక్షణ కార్యక్రమం శనివారం విజయవంతంగా ముగిసింది. జూన్ 24 నుంచి జూలై 4 వరకు పది రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో లి'సఖి పీర్ గ్రూప్ లీడర్స్'లిగా ఎంపికైన విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ నైపుణ్యాలు, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, జీవన నైపుణ్యాలు, లింగ సమానత్వం, హక్కులు, బాధ్యతలు వంటి కీలక అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన గ్రూప్ చర్చలు, అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తం చేశారు. సమస్యలను గుర్తించడం, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించడం, సమిష్టిగా పనిచేసే విధానాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య అవగాహన, సామాజిక చైతన్యం కూడా విద్యార్థినుల భవిష్యత్తుకు ఎంతో అవసరమని, ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు బాలికల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించి సమాజంలో బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వాయిస్--4 గర్ల్స్ బృందం సభ్యులు, ఉపాధ్యాయులు, వార్డెన్ ఎన్. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ లో సి సి కెమెరాలు ప్రారంభించిన సర్పంచ్



**దేవరకొండ జూలై 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ జిల్లా,డిండి మండల కేంద్రంలో ని పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల లో శనివారం స్థానిక సర్పంచ్ నల్లగంతుల రవి, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఉపాధ్యాయ బృందం తో కలిసి సిసి కెమెరా లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవి మాట్లాడుతూ ఒక కెమెరా పది మంది పోలీసుల తో సమానమని , విద్యార్థులు క్రమశిక్షణ తో మెలగాలని ,భద్రత కోసం నిఘా నేత్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఆర్సీ, పెండింగ్ బిల్లులు చెల్లించాలి



**దేవరకొండ జూలై 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కొండమల్లేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండల తహసీల్దార్ మన్నె నరేందర్ కి ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పిఆర్సీ ,డిఏ, పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యల పరిష్కారం పరిష్కారం కోసం వినతి పత్రం అందచేయడం జరిగింది. గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పి ఆర్ సి ను వెంటనే ప్రకటించాలని, సిపిఎస్ ని రద్దు చేసి ఓ పి ఎస్ ని అమలుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, పెండింగ్ లో ఉన్న ఆరు డి ఏ లను వెంటనే ప్రకటించాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి బద్దెల అంజయ్య, కొండమల్లేపల్లి మండల శాఖ అధ్యక్షులు కొమిరె సైదులు, మండల ప్రధాన కార్యదర్శి బొమ్ము రవి తదితరులు పాల్గొన్నారు.

## 108 సేవలపై ఈఎంఈ రాజబాబు సమీక్ష



**ఆమనగల్లు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించడంలో 108 అంబులెన్స్ సేవలు అత్యంత కీలకమని 108 ఈఎంఈ రాజబాబు అన్నారు. ప్రజలకు నాణ్యమైన అత్యవసర వైద్య సేవలు అందేలా అంబులెన్స్‌లలో అన్ని సౌకర్యాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆయన పేర్కొన్నారు. శనివారం ఆమనగల్లు పట్టణంలోని 108 అంబులెన్స్‌ను రాజబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులు, ఇంజెక్షన్లు, అత్యవసర వైద్య పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్, స్ట్రెచర్, ఇతర లైఫ్ సేవింగ్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉన్నాయా అని ఈఎంటీలు మహేష్, కళ్యాణ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబులెన్స్‌లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రోగుల వివరాల నమోదు, వాహన నిర్వహణ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక్క నిమిషం కూడా ఎంతో విలువైనదని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని రాజబాబు సూచించారు. అంబులెన్స్‌లోని వైద్య పరికరాలు ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని, మందుల నిల్వలను నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఎం జోన్ సైద్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**కల్వకుర్తి, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుపేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు అధికంగా చదువుతున్నారని, ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు భరించలేక ప్రభుత్వ కళాశాలను ఆశ్రయిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి. ఆంజనేయులు పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించి, అభివృద్ధి దిశగా ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు.సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కళాశాలను సందర్శించిన సందర్భంగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. అనుభవజ్ఞులైన 20 మంది లెక్చరర్లు ఉన్నప్పటికీ, సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దశాబ్దాలుగా ఫిజికల్ డైరెక్టర్ లేకపోవడం, స్పోర్ట్స్ మెటీరియల్ లేకపోవడం, కంప్యూటర్ ల్యాబ్ లేకపోవడం, సైన్స్ ల్యాబ్‌లలో తగిన సదుపాయాలు లేకపోవడం, తరగతి గదుల్లో ఫ్యాన్లు తక్కువగా ఉండడం, విద్యార్థినుల కోసం విశ్రాంతి గదులు లేకపోవడం, ఫస్ట్ ఎయిడ్ కిట్ లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని లెక్చరర్లు వివరించారు.బాత్రూములు ఉన్నప్పటికీ స్కావెంజర్ లేకపోవడంతో లెక్చరర్లు స్వయంగా శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. గత సంవత్సరం మైంటెనెన్స్ నిధులు 30 వేల రూపాయలు వచ్చినప్పటికీ ఈ సంవత్సరం ఆగిపోయాయని ప్రిన్సిపల్ రామ్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యంగా స్వీపర్, నైట్ వాచ్‌మెన్ నియామకం అత్యవసరమని పేర్కొన్నారు.ప్రస్తుతం కళాశాలలో దాదాపు 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఫస్ట్ ఇయర్‌లో 230 మంది విద్యార్థుల్లో 55 మంది ఎస్సీలు, 139 మంది బీసీలు, మిగతా వారు మైనార్టీలు, ఓసీలు, ఎస్టీలు ఉన్నారని వివరించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి పేద కుటుంబాలకు చెందిన వ్యవసాయ కూలీల పిల్లలు అధికంగా చదువుతున్న ఈ కళాశాలకు తగిన నిధులు కేటాయించి, సదుపాయాలను మెరుగుపరచాలని సిపిఎం పార్టీ ప్రభుత్వాన్ని కోరింది.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ఏపీ. మల్లయ్య, మండల నాయకులు జగన్, ఎల్. బక్కయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లను పంపిణీ



**యాచారం,జులై 4 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :** యాచారం మండలం మొండిగౌరెల్లి ప్రాథమికొన్నత పాఠశాలలో ఎన్ఎన్ఆర్ చైర్ పర్సన్ లహరి మరియు ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నవీన్ రెడ్డి శనివారం 70 మంది పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లను పంపిణీ చేశారు. ఈ సంద్భంగా ఎన్ఎన్ఆర్ చైర్పర్సన్ లహరి మరియు ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నవీన్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, వారిని చదువు వైపు ప్రోత్సహించడం మరియు చదువుకు కావలసిన వనరులను సమకూర్చడం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సంద్భంగా ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ వారి కుటుంబ సభ్యులకు పాఠశాల విద్యార్థుల తరుపున మరియు మొండిగౌరెల్లి గ్రామ ప్రజల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి :

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోటె శ్రీశైలం



**యాచారం , జులై 4 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యాచారం మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోటె శ్రీశైలం అన్నారు. శనివారం మండల పరిధిలో అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన కొప్పు రామకృష్ణకు ఎమ్మెల్యే మల్ రెడ్డి సహకారంతో ?32,000/- చెక్కును, కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు నక్క లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నక్క మహేందర్, కొప్పు వెంకటస్వామి, నాయకులు చీర శేఖర్, సామ రాములు, మల్లయ్య, నక్క పండరి, వార్డు సభ్యులు నక్క కలమ్మ, నందు, అంజలి పాండు, మోతిలాల్, చెన్నకేశవులు, లక్ష్మయ్య, కృష్ణయ్య, శివరాజ్, రవి , గణేష్,నరేందర్, ధనుష్ ,కుమార్, తదితరులు పాల్గొన్నారు

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఎలిగేడు, జూలై 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎలిగేడు మండలంలోని శివపల్లి గ్రామంలో ఎస్సీకాలనీలో శనివారం రహస్యంగా పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. పేకాటలో డబ్బు పందెం కాస్తు ఆడుతున్న నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున వారినుండి రూ.4800 నగదు, నాలుగు మొబైల్ఫోన్లు, ఒక పేకాట సెట్ స్వాధీనం చేసుకుని ఎలిగేడు పోలీసుస్టేషన్ త రలించి కేసు నమోదు చేసినట్లు ఎలిగేడు ఎస్సై మధుకర్ తెలిపారు.

# కాలనీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు నియోజకవర్గంలోని కాలనీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

శనివారం ఉదయం బీరంగూడ డివిజన్ పరిధిలోని సిద్ధార్థ కాలనీ, ప్రణీత్ కౌంటీ మిత్ర విహార్ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమావేశమై తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, పార్కులు తదితర సమస్యలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గ్రీన్ మెడోస్ కాలనీ, మిత్ర విహార్ కాలనీల మధ్య ఉన్న 4,745 గజాల స్థలంలో ఆధునిక సౌకర్యాలతో నూతన పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పిల్లల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, పచ్చదనం వంటి సదుపాయాలతో పార్కును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్ల పరిధిలోని కాలనీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా పరిశీలిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరు తప్పనిసరిగా పాల్గొని, స్థానికంగా తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తమ కాలనీలో ఎమ్మెల్యే స్వయంగా పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇవ్వడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, డీఈ వెంకటరమణ, విద్యుత్ శాఖ ఏడీఈ సంజయ్, మాజీ ప్రజాప్రతినిధులు కృష్ణ, మల్లేష్, సీనియర్ నాయకులు గోపాల్, జగదీష్, తులసి రెడ్డి, శ్రీకాంత్ తదితరులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



# సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**నంద్యాల, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9న బనగానపల్లె మండలంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన విజయవంతం కావడానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ముందస్తు ఏర్పాట్లు, వివిధ శాఖల ప్రగతి నివేదికలపై చర్చ జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ, పర్యటనలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొననున్నందున ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని సీఎం కార్యక్రమానికి హాజరై, ఆయన అడిగే ప్రశ్నలకు సూటిగా సమాధానాలు ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు.పెన్షన్ల పంపిణీ, వైద్య ఆరోగ్యం, గ్రౌండ్ వాటర్, ఉద్యానవన సాగు, హ్యాండ్లూమ్స్, రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్, డ్వామా, ప్రజా సమస్యల పరిష్కార వేదిక వంటి అంశాలపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## నల్లెల్ల పాఠశాలకు 4 ఫ్యాన్లు విరాళం..





**కురవి , జూలై 4( నీలగిరి ఎక్స్ ప్రెస్) :** నల్లెల్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల మరియు ఉపాధ్యాయుల కోరిక మేరకు వారికి అవసరమైన 4 ఫ్యాన్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహిపాల్ అందజేసిన సర్పంచ్ రెంటాల కృష్ణ , సయ్యద్ అఫ్జల్ అందజేశారు. ఈ సంద్భంగా ప్రధానోపాధ్యాయులు మహిపాల్ మాట్లాడుతూ.. పాఠశాల కు ఫ్యాన్లు అడగగానే తమకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపిన పాఠశాల బృందం. సర్పంచ్ రెంటాల కృష్ణ , మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అవసరం ఉన్న విషయాన్ని తమ దృష్టి తీసుకోవాలని సర్పంచ్ కృష్ణ ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు స్వచ్ఛందంగా ముందు రావాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యతండా సర్పంచ్ మంగీలాల్,నల్లెల్ల ఉప సర్పంచ్ కృష్ణమూర్తి, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బండి దీపక్ గౌడ్, యువజన సంఘం నాయకులు విశాక్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు



**ఎలిగేడు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎలిగేడు మండలం ర్యాకల్దేవుపల్లి సర్పంచ్ మద్దెల రమాదేవి-సంపత్ తెలిపారు. గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును క్లోరినేషన్ చేయించి, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, చెదారం, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించారు.వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే చోట దోమలు విస్తరించే అవకాశం ఉన్నందున గ్రామంలో రోడ్ల వెంట ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. నిర్ణీత తేదీల వారీగా క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడిగె కృష్ణగౌడ్, పంచాయతీ కార్యదర్శి అశోక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పొడిగించాలి



**నందికొట్కూరు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జూలై చివరి వరకు పొడిగించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.శనివారం నందికొట్కూరు తాసిల్దార్ కార్యాలయంలో ఆత్మకూరు ఆర్డీవో వెంకట శివ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమానికి సరిపడా సిబ్బంది లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 2002 ఎన్నికలలో ఎక్కడ ఓటు వేశారో వాటి ఆధారంగానే ప్రస్తుత నమోదు జరుగుతుండటంతో చదువు రాని వారు, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు.బిఎల్వోలు సిబ్బంది కొరత కారణంగా ఒంటరిగా సర్వే చేపడుతుండటంతో కష్టాలు పెరిగాయని, తక్కువ సమయం కారణంగా ఇప్పటివరకు కేవలం 44 శాతం మాత్రమే నమోదు పూర్తయిందని ఆయన తెలిపారు. ఈ పరిస్థితుల్లో సిబ్బందిని పెంచి, జూలై నెల చివరి వరకు ఎస్ఐఆర్ ప్రక్రియను పొడిగించాలని ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు కాటి పోగు సామన్న, వడ్డే సుధాకర్, ఎస్. మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు లోక్ అదాలత్ బెంచ్ ఏర్పాటు



**నందికొట్కూరు, జూలై 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూలై 11న నందికొట్కూరు సీనియర్ మరియు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జరగనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఏ. శోభారాణి పిలుపు నిచ్చారు. శనివారం కోర్టు హాల్‌లో బార్ అసోసియేషన్ న్యాయ వాదులు, పోలీస్, బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజీ అయ్యే సివిల్ మరియు క్రిమినల్ తగాదాలలో ఇరుపక్షాలతో మాట్లాడి అవగాహన కల్పించాలని సూచించారు. కక్షిదారుల సౌలభ్యం కోసం ముందస్తు లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, నందికొట్కూరు ప్రాంతంలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శోభారాణి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీస్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# నీలగిరి సాహితీ సంగమం 12

## శీర్షిక: స్వప్న ప్రకరణము 6

ఆ వె
ఐదు యింద్రియములు నంతఃకరణమును
నాద మరచి నిదుర యందు నుండు
కలలు కలుగవింక కలుగు హాయి మిగులు
నదియె నగు సుషుప్తి యందరందు
ఆ వె
కన్న కలలు ఫలము లన్ని నీయగబోవు
కొన్ని మాత్రమిచ్చు కోరు ఫలము
సజ్జనుండు గలను సందేశ మందిన
దానినాచరించి ధన్యుడగును
ఆ వె
కలల నమ్ము వారు కలరెందరో చూడ
గలలు గొందరిలను గల్ల లంద్రు
గలలు గనెడి వారు గలిగిన గలనున్న
దాని భావ మరయు దపన నుంద్రు

**సత్యనారాయణ బొలిశెట్టి, హైదరాబాద్**

## శీర్షిక: ఆధ్యాత్మికము

ప్రక్రియ: పద్యములు (ఆటవెలది)
ఆటపాట లందు నధిక రక్తి గలిగి
భక్తి ధ్యాస తగ్గు బాల్యమందు,
కామితముల చిక్కి కౌమార్య మందున
భక్తి ధ్యాస తగ్గు పట్టు లేక.
వయసు వృద్ధి నందు బరువు బాధ్యతలతో
భక్తి ధ్యాస తగ్గు బంధితులుగ,
వెతల వేడుకొనుచు విడుపుకు దేవుని
భక్తి ధ్యాస తగ్గు ముక్తి పథిని.
విద్య బోధ నందు విధిగ భక్తిని జేర్చి
ప్రతి దినమగు సేవ ప్రాథమికము,
ధర్మ వర్తనంబు కర్మల ప్రబలమై
సామరస్య మలర సాగు జనులు.

**వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాద్**

## వైద్యోనారాయణో హరి:

సీసం:
ఆపదంటేచాలు అరక్షణమాగక
ఆదుకొనెడివారు వైద్యులేను!
తల్లి పాలవలెను తండ్రి పాలన రీతి
వైద్యులిచ్చెడిమందు వసుధలోన!
ఎండవానచలియు ఎట్టికాలమునైన
సేవచేయునెపుడు చెలిమితోడ!
భార్య పిల్లలులేరు బంధుమిత్రులులేరు
కష్టమనినతాను కాచునెపుడు!
ఆ. వె:
రాత్రి పగలు లేక రక్షించు వాడేను
చావు నుండి కాయు చరకుడితడు
అవనిలోన నితడు అపర ధన్వంతరీ
వైద్యులార! మీకు వందనాలు!

**డా. యర్ర హరికిషన్, తుంగతుర్తి**

## శీర్షిక :-మామిడి పండు

**సీసం**
పచ్చని తోటల -పచ్చనై యుండెడు
పసిడి వన్నెలతోడ -పసరు పండు;
కోరిక మీరగ౯ -కోమల గుజ్జుతో
మధుర రసములిట్లు -మనసు పడగ
మహిలోన నెల్లరు మక్కువ తోడను
కోసిన వెనువెంట -గొసరు తినెడి
మామిడి పండ్లను మాన్యము గా నెంచు
రాజుగ విందులో -రమ్యమొప్పు;
**తేటగీతి**
మాన వాళికి మదులను దోచు చుండు
మామి డినె రుచి చూడగ మధుర మగుచు
పండ్ల రాజుగ జగతిని పరగుచుండ
ప్రకృతి మనకిడు సురుచిర వరము కదర!

**కానుకొలను లక్ష్మీసీత హైదరాబాద్**

## "ధన మూల మిదం జగత్"

**మంజరీ ద్విపద:**
ధనమేను ముఖ్యము ధరణిన నెపుడు
వేష భూష ము లకే విలువ నిచ్చు చును
గుర్తించు చుందురు కోటిలో నైన,
ధనముండి నగలను ధరియించ కున్న
సింపులు గా నుంది చిత్ర మందురులె,
ధనమేను లేకున్న దాని వద్దేమి
గలవని హేళన కలిగి చూచుదురు
ధనమేను వచ్చిన దగ్గర వుదురు,
బంధు,బలగములు, బహుళ మిత్రులును.
ధనమేను పోయిన తప్పుకుందురుగ,
సద్విని యోగము సమయ మవగను,
కలుగు ఫలితములు కనక మయమగు
ధనమేను ముఖ్యము ధరణి న నెపుడు
తెలుసుకో మిత్రమా తెలివితో నీవు

**వసుమతీ జగన్నాథం.**

## "మజ్జిగ పులుసు!"

కందము:
తెలుగుల విందున మజ్జిగ
పులుసొక రాణిగ కులుకుచు
మురిపించునహో
చలువను జేయును తనువుకు
కలుపగ సొరకాయనందు గమ్మటి
రుచికై!
**మత్తకోకిల:**
చల్లచారును గందిపచ్చడి చక్కగా
జతగూడులే
అల్లమున్ మిరియాలు గొబ్బరి యన్ని
ముద్దగ జేయుచున్
పుల్లమజ్జిగలోన జేర్చుచు బొబ్బ మీరగ
కాచగా
చెల్లిపోవును వెంటనే రుచి శ్రేష్ఠమై
చవులూరగా!
**సీసము:**
పలురీతులియ్యది పరిఢవిల్లు భువిపై
గుజరాతున 'కడీ'గ కూర్మి జెలగు
మదరాసు, కేరళ మంది బిలువ రీతి
మోర్కొళంబవియల్ల మోజు తోడ
పాలకూరయు, మెంతి, బచ్చలి యాకుతో
గూడితనువుకిడు కుశలము విధి
వంగ, బెండ, మునగ వాసిగా యానప
జేర్చి వండ పులుసు జిహ్వ లేచు!
**ఆటవెలది:**
ఆరు రుచుల వంట లారగించుటలోన
తెలుగువారల కిల తిరుగులేదు
ఒక్కసారి తినగ యూరించు మరిమరీ!
కమ్మనైన పులుసు కల్ల కాదు!

**కుసుమ ఉప్పలపాటి హైదరాబాదు**

## డాక్టర్స్ డే

వైద్యో నారాయణో హరిః
వైద్యులనగాను విష్ణురూపులు
ప్రాణము పోయు శివాత్ములు
ధర్మాన్ని కాపాడే ఇలవేల్పులు
దయతోడ రోగులను
సేదతీర్చు ధన్వంతరీ
వారసులు
వైద్యో నారాయణో హరిః
భయములను పారద్రోలు
చతుర్ముఖ బ్రహ్మలు
కర్కష కరోనా రక్కసిని
దునుమాడిన
కరుణాసింధులు
శాంతి చిహ్నాలు, ధవళ
కపోతాలు
అప్పిచ్చు వాడు కాదు
వైద్యుడు
ఆదరణతో ఆయువు పోసి
ప్రాణ వాయువు పెంచువాడు
రోగులతో రోజులు గడిపి దీర్ఘ
రోగాలను తరుమువారు
ఎందరో రావాలి ప్రాణ
దాతలు
అందరికి కలగాలి ఆరోగ్య
భాగ్యాలు
జయము జయము
వైద్యులారా
జయము జయము ప్రాణ
దాతలారా

**శర్వాణి పాతూరి**
**మైత్రి పరిమళం**

## మత్స్యావతారము

తే.గీ.
జగతి నాపదల్ దొలగించి జయమునీయ
యుగయుగముల యందున హరి యుద్భవించి
రక్షజేయు ప్రళయమున లక్ష్యదిశకు
జేర్చి,మార్గము ద్రిప్పగా దీర్చువెతలు
తే.గీ.
సృష్టి జేయగ బ్రహ్మయు సిద్ధమౌగ
నిద్ర యావహించె నత్తరి నిలువకుండ
సోమకుండను దైత్యుడు చొచ్చెనచట
వేదములనుకాజేయగా వేగమతడు
తే.గీ.
మత్స్యరూపాన యసురుని మట్టుబెట్టి
వేద సంపద గాపాడె విష్ణుమూర్తి
ధర్మ సంరక్షణొనరించి ధరణియందు
శిష్టరక్షణ సేసెను సిరివిభుండు

**మాతా.గంగాభవానీ శాంకరీదేవి,చెన్నై.**

## మత్స్యావతారము

తే.గీ.
జగతి నాపదల్ దొలగించి జయమునీయ
యుగయుగముల యందున హరి యుద్భవించి
రక్షజేయు ప్రళయమున లక్ష్యదిశకు
జేర్చి,మార్గము ద్రిప్పగా దీర్చువెతలు
తే.గీ.
సృష్టి జేయగ బ్రహ్మయు సిద్ధమౌగ
నిద్ర యావహించె నత్తరి నిలువకుండ
సోమకుండను దైత్యుడు చొచ్చెనచట
వేదములనుకాజేయగా వేగమతడు
తే.గీ.
మత్స్యరూపాన యసురుని మట్టుబెట్టి
వేద సంపద గాపాడె విష్ణుమూర్తి
ధర్మ సంరక్షణొనరించి ధరణియందు
శిష్టరక్షణ సేసెను సిరివిభుండు

**మాతా.గంగాభవానీ శాంకరీదేవి,చెన్నై.**

## శీర్షిక:యోగమేక్షేమము

కం.
యోగముచిత్తనిరోధము
యోగమ్మేశాంతినిచ్చు ,నుజ్జ్వలరీతిన్
భోగముమానసశాంతియు
రోగమ్ములనణచివేయు.,రుచిరత్వముగా.
తే.గీ.
దేహమునకునారోగ్యము.,తేజమబ్బు
అష్టసిద్ధులసిద్ధియై ,నణగురుజలు
ధ్యానమార్గానుసరణము ,ధ్యాసయగును
మత్తుతొలగించినడపు ,గమ్మత్తుగాను.
ఆ.వె.
అష్టయోగసరళి ,నాపతంజలిభిక్ష
బ్రహ్మపథముజూపు ,పరమపదము
తత్వసారమరసి ,తాత్వికమార్గాన
మోక్షథముజూపు ,మునులపదము.
కం.
ఆహారనియమపాలన
ఆహా ,యనదేహదీప్తియందించుగదా!
ఓహో ,యోగా ,మానవ
మోహాలనుతొలగజేయు.,ముక్తిపథమ్మై.

**-అవధానిని.డా.గాయత్రీదేవి.**

## అమరులు

కం!!
మరణించ వచ్చు రాజులు
మరణింతురు నేతలైన మానవులెల్లన్
మరణించు జీవజాలము
మరణము లేదయ కవులకుమహిలో
కృష్ణా!!!

**గడ్డం కృష్ణారెడ్డి.రేపాల సూర్యాపేట!!**

## నాన్నకు ప్రేమతో

కంటిపాపకి కనురెప్ప లాగా
పట్టు పురుగుకి పట్టుకాయ
లాగా
తాబెలుకి చిప్ప లాగా
అనునిత్యం కాపడేధి నాన్న
బారానికి మించి భాధ్యతతో
అనునిత్యం మన కోసం శ్రమిస్తు
కష్టం అంటే మనకి తెలియకుండ
అనునిత్యం పోషిశీచెధి నాన్న
మన ఆనందంలో తన సంతోషాన్నీ
మన సరధాలలో తన ఆనంధాన్నీ
మన తపనలో తన అన్వేషణతో
అనునిత్యం ప్రేమిశీచెధి నాన్న

**సంగీత కరీంనగర్**

## నాన్నకు ప్రేమతో

కంటిపాపకి కనురెప్ప లాగా
పట్టు పురుగుకి పట్టుకాయ
లాగా
తాబెలుకి చిప్ప లాగా
అనునిత్యం కాపడేధి నాన్న
బారానికి మించి భాధ్యతతో
అనునిత్యం మన కోసం శ్రమిస్తు
కష్టం అంటే మనకి తెలియకుండ
అనునిత్యం పోషిశీచెధి నాన్న
మన ఆనందంలో తన సంతోషాన్నీ
మన సరధాలలో తన ఆనంధాన్నీ
మన తపనలో తన అన్వేషణతో
అనునిత్యం ప్రేమిశీచెధి నాన్న

**సంగీత కరీంనగర్**

## ....టీవి..బీపి....

సీ!!
మగనికి వార్తలు మగువకు మాటీవి
ఆరిమోటుకొరకు నలజడెపుడు
సీరియళ్లన్నియు సీరియస్ గాచూడ
ఛానలే మార్చగా సైప లేరు
కోపమించుకతోడ కూకలే
యంగనే
వంటింటిరాగాలు పలుకునపుడు
అందరూ వీక్షించు నలవాటు
లేదాయె
ఆఇంట కనరాదు యటువంటి
యాటవిడుపు
ఆ!!
తెలుగుసీరియళ్లు తెగులునే తెచ్చెనే
వేళ పాళ లేక విసుగు నిచ్చి
ఏటి కేళ్లు లాగి యారీతి వెతలతో
వెర్రి వాళ్ళ జేసె వీక్ష కులను..

**-గవిచర్ల వేంకట దుర్గా ప్రసాద్ శాస్త్రి... హైదరాబాద్**

## రాధాగోపాలం

**పంచాక్షరి పంచపది**

రాధా గోపాలం
గోపికా లోలం
తకధిం తాళం
డప్పుల మేళం
భళారే నాట్యం విఠల!

బృందావిహారం
సుమనోహరం
నాట్య మయూరం
సాగర తీరం
రమణీయమే విఠల!

నంద సుతుడు
వస్త్ర చోరుడు
వెన్న దొంగడు
ఓ మాయగాడు
అందరివాడు విఠల!

గోల గోలాటం
కోల కోలాటం
ప్రేమ పోరాటం
రాధకారాటం
కృష్ణ లీలలు విఠల!

గజ్జె ఘల్లనె
గుండె గొల్లనె
మేను ఝల్లనె
హృది జిల్లనె
కన్నయ్య కోసం విఠల!

పాదాలు ఆడే
పెదాలు పాడే
జంటలు కూడే
జీవితం మోడే
ప్రేమిక ఓడె విఠల!

యమ తుంటరి
చేసె అల్లరి
వచ్చె వయ్యారి
పొట్టి పొన్నారి
జత చేరిరి విఠల!

నది చెంతలో
వన సీమలో
రాధా మదిలో
హృది హృదిలో
కృష్ణుడున్నాడు విఠల!

పారవశ్యమే
కలవరమే
గంద్ర గోళమే
మాయాజాలమే
ఎన్ని ప్రేమలో విఠల!

ముందు నిలిచె
రాధ వలిచె
మనసు దోచె
చీరలు దాచె
ఏమేమో చేసె విఠల!

**కాటేగారు పాండురంగ విఠల్ హైదరాబాద్**

## రాధా హృదయం

ఉత్సాహ వృత్తము.
చేరబిలిచె వెన్నెల నిస చెంత చేర
రాగదే
రార వేణు గోప బాల రాధ దరికి
వేగమే
నేరమెంచ బోకు మయ్య నీదు చరణ
దాసిపై
కోరెనయ్య నీదు కరుణ కూర్మిగాను
జూపుమా!

**పేరి భార్గవి. విశాఖ పట్నం**

## ఆషాఢ వేళ

తే.గీ.
నీలి మబ్బులు పరచుకు నింగి యందు
వాన జల్లులు కురియుచు వసుధ తడుప
మిడిసి పడుచు తలల నెత్తి మొలక లన్ని
పంట చేల పచ్చదనము పరచుకొనును
తే.గీ.
సంప్రదాయముల్ పాటించి చక్క గాను
రుబ్బ గోరింట ముద్దను రోటి యందు
రమణు లరచేత దిద్దగ లతల వోలె
పండు నెర్రగ మెరయుచు పాణి యందు
తే.గీ.
అత్త యింట నడుగు మోప హద్దు లిడుచు
కొత్త జంట కోరికలకు గోడ కట్టి
విరహవేదన వారికి పెంపు జేయ
వచ్చు నాషాఢ మాసము పరుగులిడుచు

**మరింగంటి శ్రీనివాస్ హైదరాబాద్**

## రాధకుమాధవుడు

నీలిమేఘు శ్యామ సుందరుడు
నిరతము మమ్ము కాచు విభుడు
కస్తూరి తిలక శోభతుడు
కాంచనాంబ ధరుడు
రాధకు మాధవుడు
పిల్లనగ్రోవి వాడు
పిలిచిన పలికె దేవుడు
అల్లరి ఆటల అచ్యుతుడు
ఆనందము పంచు నందనందనుడు
రాధకు మాధవుడు
బృందావనికి అందము వీడు
రాసక్రీడకు సారధి రమా రమణుడు
వేణులోలుడు వేదతతి ప్రియుడు
రాధకు మాధవుడు

**శర్వాణి పాతూరి కామారెడ్డి జిల్లా**

## ఆమే...

వేసవి తాపాన్ని చల్లని గాలులుగా మలిచే
నైపుణ్యం
చలి కాలపు వణుకును మరిపించే నులు
వెచ్చని చాకచక్యం
ఆకలని తెలియకపోయినా పక్కన పడుకుంటే
నిదురించే బాల్యం
చదువు సంస్కారాల మెళుకువలు తెలియజెప్పే
అతి సున్నిత పాఠం
కుటుంబం మొత్తాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చే
ప్రయత్న పూర్వక లాలిత్యం
అందరి మనసుల గూడుకట్టుకున్న గట్టి
నమ్మకానికి
ఆమే ఒక కళ్యాణ తిలకం
ఆమె మాట జవదాటడానికి ఏమాత్రం
సాహసించని
లక్ష్మణ రేఖ సమానం
అంతటి ఆమెను ఆమెగా ఉంచుదాం
ప్రతి రోజూ అమృతధారలు గ్రోలుదాం

**శశిశేఖర్ అల్లంకి ఏలూరు**

## రైతన్న

పచ్చని పొలాలే మా పల్లెకు
అందం
కష్టపడే రైతులే దేశ ప్రగతికి
ఆధారం
వేకువజామునే రైతన్న పొలానికి
వెళ్లి
చెమటను చిందించి విత్తనాలు
వేస్తాడు
?రైతు పండించే ప్రతి పంట గింజ
మనకు కడుపు నింపే పరమౌషదం
ఎండా వానలకు వెనకడుగు
వేయక
పంటనే నమ్మి శ్రమించే కష్టజీవి
రైతన్న!
చిరుజల్లులతో ప్రకృతి పులకరించే
పచ్చని పైరులతో పల్లె అందాలు
కనువిందు చేసే
పక్షుల కిలకిల రాగాలు పల్లెను
మేల్కొల్పే
రైతన్నల మనసు ఆనందంతో
పరవశించే
అందుకే పచ్చదనంను పెంచుదాం
పర్యావరణాన్ని కాపాడుదాం
రైతున్నలను గౌరవిద్దాం
అందరం సంతోషంగా జీవిద్దాం!

**నాగుల శ్రీనిత్య, బి.కాం. సెకండ్ ఇయర్ హైదరాబాద్.**

## ఓం నమః శివాయ

కందములు
తుహినాచలమది కొలువుగ
మహిమాన్వితుడౌ పశుపతి మంగళకరుడా
అహిభూషణుడగు శర్వుని
మహేశుని గొలిచి తరింతు మానసమందున్!
శిరమున గంగయు చంద్రుడు
నురమున నాగుల సరములు నుదుటను గన్నున్
కరమున డమరుక మొప్పగ
వరములనిడు వేల్పువీవె పరమేశ్వరుడా !
హరహర శంభో యనుచును
నిరతము జపమున దలచెద నిటలాక్షానిన్
హరణము జేయుమ పాపము
మరువక గొలిచెద పదములు
మంగళ మూర్తీ !

**శ్రీమతి టి. లక్ష్మీకృష్ణ హైదరాబాద్**

## మతము:

మతము మానవునికి మార్గ దర్శకమౌను
మతము మానవులకు మాన్య పథము
మతములేవియైన మానవత్వము మిన్న
మతము చూపవలెను మనకు హితము.
మతము పేర వలదు మారణహోమంబు
సర్వమతసమాన సహన గుణము
స్వీకరించ౯ మనము సిద్ధ పడుచునుండ
సకల జనుల హితము సాధ్యమగును. 2
భిన్నమతములున్ననభిమతమ్ములొకటే
ఒకరికొకరు కలిసి ఓర్మి తోడ౯
సలుపు కార్యములను శక్తిబెంచ౯
దేశ ప్రగతి పెరిగి దీప్తి చెందు.

**కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి.**



# ఎంగేజ్‌మెంట్ అయిన విషయం దాచిపెట్టిన హీరో..

## డేటింగ్ పేరుతో నన్ను మోసం చేశాడన్న మమతా మోహన్ దాస్

టాలీవుడ్ ప్రేక్షకులకు యమదొంగ సినిమాతో సుపరిచితురాలైన మమతా మోహన్‌దాస్ దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కేవలం హీరోయిన్‌గా మాత్రమే కాకుండా గాయనిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. మలయాళ చిత్రసీమలో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత తెలుగు--తమిళ భాషల్లోనూ వరుస అవకాశాలు అందిపుచ్చుకున్నారు. తెలుగులో యమదొంగతో పాటు కృష్ణార్జున, హోమం వంటి చిత్రాల్లో నటించి మంచి ఆదరణ పొందారు. స్వచ్ఛమైన నటన, అందమైన స్క్రీన్ ప్రెజెన్స్, మృదువైన గాత్రం ఈ మూడు కలయిక ఆమెకు ప్రత్యేకమైన క్రేజ్‌ను తీసుకొచ్చాయి.అయితే కెరీర్ సక్సెస్‌ఫుల్‌గా సాగుతున్న సమయంలోనే మమత వ్యక్తిగత జీవితంలో తీవ్రమైన సవాళ్లు ఎదురయ్యాయి. 2009లో ఆమెకు మొదటిసారి క్యాన్సర్ నిర్ధారణ కావడం సినీ వర్గాలను షాక్‌కు గురిచేసింది. దీర్ఘకాల చికిత్స అనంతరం కోలుకుని మళ్లీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చారు. కానీ 2013లో మరోసారి అదే వ్యాధి తిరగబెట్టింది. అంతేకాదు, ఆమెకు విటిలిగో (బొల్లి) సమస్య కూడా తలెత్తింది. వరుస ఆరోగ్య సమస్యలు ఎదురైనా ఆమె ధైర్యం కోల్పోలేదు. తన అనుభవాలను పంచుకుంటూ క్యాన్సర్ సర్వైవర్‌గా అనేక మందికి ప్రేరణగా నిలిచారు. కొంత విరామం తర్వాత 2023లో విడుదలైన రుద్రాంగి సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చి తన రీ-ఎంట్రీని గుర్తుండిపోయేలా చేసుకున్నారు.ఇటీవల ప్రముఖ నటి సుహాసిని మణిరత్నం నిర్వహించిన ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మమతా, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక విషయాలను బహిరంగంగా పంచుకున్నారు. ముఖ్యంగా ప్రేమ, డేటింగ్ విషయాల్లో ఎదురైన చేదు అనుభవాలు అభిమానులను కదిలించాయి. క్యాన్సర్ నిర్ధారణ తర్వాత జీవితాన్ని మరింత సానుకూలంగా చూడాలని, సాధారణ మహిళలా తన భావోద్వేగాలను అనుభవించాలని భావించానని ఆమె తెలిపారు. మలయాళ పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ నటుడు తనను డేటింగ్‌కు ఆహ్వానించాడని, కుటుంబ సభ్యుల అనుమతితో ఆ పరిచయాన్ని కొనసాగించానని చెప్పారు. అయితే ఆ వ్యక్తికి అప్పటికే మరొకరితో నిశ్చితార్థం జరిగిన విషయం తర్వాత తెలిసిందని వెల్లడించారు. ఈ విషయం తనను తీవ్రంగా కలిచివేసిందని, నమ్మకద్రోహం మానసికంగా కుంగదీసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మరో వ్యక్తితో పరిచయం ఏర్పడినా, అతను ప్రేమకంటే తన కెరీర్ ముఖ్యమని చెప్పడంతో ఆ బంధం కూడా ముగిసిపోయిందని తెలిపారు.ఈ అనుభవాలన్నీ తనకు జీవిత పాఠాలు నేర్పాయని, ఇప్పుడు తాను మరింత బలంగా మారానని మమతా చెప్పారు. వ్యాధులతో పోరాడి గెలవడమే కాకుండా, వ్యక్తిగత జీవితంలోని ఎదురు దెబ్బలను కూడా ధైర్యంగా ఎదుర్కొన్న ఆమె ప్రయాణం అనేక మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

# బాలీవుడ్‌ను వణికిస్తున్న బెదిరింపులు.. నటి హిమాన్షీకి ప్రాణహాని రూ.10 కోట్ల డిమాండ్!



బాలీవుడ్ ప్రముఖ నటి, గాయకురాలు హిమాన్షీ ఖురానాకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ప్రాణహాని తలపెడతామనే హెచ్చరికలు రావడం ఇండస్ట్రీలో కలకలం రేపుతోంది. ఇంతకుముందు కూడా ఇలాంటి బెదిరింపులు బాలీవుడ్ ప్రముఖులకు వచ్చాయి. జీషన్ అక్తర్ అనే పేరుతో పంపిన ఈమెయిల్‌లో పది కోట్ల రూపాయలు ఇవ్వాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఒక వాయిస్ నోట్ ద్వారా నిందితుడు హిమాన్షీని బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన హిమాన్షీ వెంటనే మొహాలీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పంజాబీ చిత్రం 'సద్దా హక్'తో వెలుగులోకి వచ్చిన హిమాన్షీ, బిగ్‌బాస్ సీజన్ 13 ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. కేవలం హిమాన్షీ మాత్రమే కాకుండా, ఇటీవల స్టార్ డైరెక్టర్ రోహిత్ శెట్టి, హీరో రణ్‌వీర్ సింగ్‌లకు కూడా ఇలాంటి చేదు అనుభవాలే ఎదురయ్యాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన హ్యారీ బాక్సర్‌గా పరిచయం చేసుకున్న ఒక వ్యక్తి, వారిద్దరికీ వాట్సాప్ ద్వారా వాయిస్ మెసేజ్‌లు పంపుతూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్‌లను నెరవేర్చకపోతే వారి వ్యక్తిగత సిబ్బందిని హతమారుస్తానని హెచ్చరించడం బాలీవుడ్ వర్గాల్లో ఆందోళనను పెంచుతోంది. వరుసగా సినీ ప్రముఖులే లక్ష్యంగా సాగుతున్న ఈ బెదిరింపుల వెనుక ఉన్న ముఠాలను పట్టుకునేందుకు పోలీసులు తమ విచారణను వేగవంతం చేశారు.



# 'స్వయంభూ' టీజర్‌పై చర్చ రగిలించిన నిఖిల్ పోస్ట్ ..

**ఎవరిని ఉద్దేశించి ఆ కామెంట్ చేశాడు**

టాలీవుడ్‌లో థ్రిల్లర్ సినిమాలతో తనకంటూ ప్రత్యేక మార్కెట్ సంపాదించుకున్న యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ ప్రస్తుతం భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ స్వయంభూ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ ఇటీవల విడుదలై మంచి స్పందన దక్కించుకుంది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆకట్టుకోవడంతో సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. అయితే టీజర్‌కు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్‌తో పాటు మరో అంశం టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టీజర్‌ను ఎణ= క్వాలిటీలో మళ్లీ అప్‌లోడ్ చేసిన సందర్భంగా నిఖిల్ చేసిన ఒక కామెంట్ చర్చకు దారితీసింది. యూట్యూబ్ గ్లిట్జ్‌ల వల్ల టీజర్‌ను మళ్లీ అప్‌లోడ్ చేశాం అని పేర్కొన్న ఆయన, చివర్లో "రీసెంట్‌గా వచ్చిన ఒక సినిమాలా మా చిత్రంలో ఎలాంటి ూ× వినియోగించలేదు అని స్పష్టంగా చెప్పడం విశేషంగా మారింది. ఈ ఒక్క కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిఖిల్ ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్య చేశారనే దానిపై నెటిజన్లు చర్చలు మొదలుపెట్టారు. ఇటీవల విడుదలైన కొన్ని సినిమాల్లో విజువల్ ఎఫెక్ట్స్, డీప్‌ఫేక్ టెక్నాలజీ, AI టూల్స్ వినియోగంపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో "నిఖిల్ ఏ సినిమాను టార్గెట్ చేశాడు?" అన్న ప్రశ్న సినీ వర్గాల్లో వినిపిస్తోంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా చేసిన కామెంట్ అయినా, ఇది ఇండస్ట్రీలో టెక్నాలజీ వినియోగంపై మరోసారి చర్చ మొదలయ్యేలా చేసింది. కొందరు నిఖిల్ పారదర్శకతను ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇది అవసరం లేని పోలిక అని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి టీజర్ కంటే ఎక్కువగా నిఖిల్ చేసిన ఈ AI వ్యాఖ్యే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.'స్వయంభూ' సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగిన వేళ, ఈ వివాదం కూడా చిత్రానికి అదనపు ప్రచారం తీసుకువచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దర్శకబృందం మాత్రం కంటెంట్ క్వాలిటీ, విజువల్ గ్రాండియర్‌పైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. రిలీజ్ డేట్‌పై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# రెడ్ కార్పెట్‌పై ఫోటోగ్రాఫర్‌కు వార్నింగ్ ఇచ్చిన ఆయేషా ఖాన్ ..



డ్యాన్సింగ్ క్వీన్‌గా పేరుగాంచిన ఆయేషా ఖాన్ ఓ ఫోటోగ్రాఫర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ముంబైలో జరిగిన ɹబ ˉఖ మీఖఱఅ స్పెషల్ స్క్రీనింగ్ సందర్భంగా ఈ ఘటన జరిగింది. స్క్రీనింగ్‌కు హాజరైన ఆయేషా రెడ్ కార్పెట్‌పై ఫోటోలకు పోజులు ఇస్తుండగా, కొందరు ఫోటోగ్రాఫర్లు ఆమెను వెనుక వైపు నుంచి వీడియో తీయడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన ఆమె వెంటనే అసహనం వ్యక్తం చేస్తూ వారిని సున్నితంగా హెచ్చరించారు. "ఆప్ ఇజ్జత్ ఖుద్ కమాయేంగే, ఔర్ ఖుద్ హీ గవ్వాయేంగే... ప్లీజ్ మత్ కరియే, అచ్చా నహీ లగ్తా" అంటూ హిందీలో వ్యాఖ్యానించారు. అంటే "గౌరవాన్ని మీరే సంపాదించుకుంటారు... మీరే కోల్పోతారు... దయచేసి ఇలా చేయకండి, ఇది మంచిది కాదు" అనే అర్థం. ఆమె వ్యాఖ్యలు అక్కడున్న వారిని కాసేపు ఆలోచింపజేశాయి. సోషల్ మీడియా యుగంలో సెలబ్రిటీల వ్యక్తిగత గోప్యతను పట్టించుకోకుండా అసభ్యకర యాంగిల్స్‌లో ఫోటోలు తీయడం పెరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కూడా ఆయేషా స్పందిస్తూ "ఊప్స్ మూమెంట్స్ కోసం వెతకడం సరైంది కాదు" అని అభిప్రాయపడింది.

# ఒక్క డైలాగ్ నచ్చి సినిమా తీశా!

'కోర్ట్' సినిమాతో హిట్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు హర్ష్ రోషన్, శ్రీదేవి. వీరిద్దరూ 'బ్యాండ్‌మేళం' చిత్రంతో మరోమారు వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కోన వెంకట్ నిర్మించారు. మార్చి 13న విడుదలకానుంది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ సోషల్‌మీడియా ద్వారా విడుదల చేశారు. 'తాళికట్టడం కలిసి ఉండటం కోసమే అయితే.. మధ్యలో విడిచిపెట్టిన దానికి కాదురా..చిన్నప్పటి నుంచి నాతోనే ఉన్న వీడికి కట్టాలిరా' అని స్టోరీ నరేషన్ సందర్భంగా దర్శకుడు చెప్పిన డైలాగ్ నచ్చి ఈ సినిమాకు శ్రీకారం చుట్టానని నిర్మాత కోన వెంకట్ తెలిపారు. తెలంగాణ నేపథ్యంలో హృద్యమైన ప్రేమకథ ఇదని, ప్రతీ సీన్‌లో ఎమోషన్స్ పండాయని దర్శకుడు పేర్కొన్నారు. హార్ట్ టచింగ్ లవ్‌స్టోరీగా అందరిని ఆకట్టుకుంటుందని నాయకానాయికలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, రచన-దర్శకత్వం: సతీష్ జవ్వాజి.

